



ఉపమాక మాడవీధుల్లో స్వామివారి తిరువీధి సేవ

సాకారం కానున్న ఆదివాసీల కల

మైదాన ప్రాంత గిరిజన గ్రామాలు ఏజెన్సీలో విలీనానికి కదలిక

శాసనసభ సమావేశాల్లో ప్రస్తావించిన ఎమ్మెల్యే బండారు



కనీస సదుపాయాలకు నోచుకోని ఓ గిరిజన గ్రామం

- సానుకూలంగా స్పందించిన మంత్రి సంధ్యారాణి
- జిల్లాలోని ఎనిమిది మండలాల్లో గిరిజన ఆవాసాలు
- 50 శాతానికి పైబడి గిరిజన జనాభా ఉన్న గ్రామాలను అల్లూరి జిల్లాలో కలిపే యోచన
- ఐటీడీఏ ద్వారా మౌలిక సదుపాయాల కల్పనతో అన్ని విధాలా అభివృద్ధి



వంతెన లేకపోవడంతో ఉరకగెడ్డలో నుంచి నడుచుకుంటూ వస్తున్న గిరిజనులు



ఊటగెడ్డ నుంచి తాగునీటిని తెచ్చుకుంటున్న గిరిజన మహిళలు

చోడవరం, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి):

ఎన్నో ఏళ్లుగా కనీస సౌకర్యాలకు నోచుకోక, అభివృద్ధికి ఆమడదూరంలో ఉండిపోయిన మైదాన ప్రాంతంలోని గిరిజనుల దశాబ్దాల కల సాకారానికి కూటమి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. అనకాపల్లి జిల్లాలోని మైదానప్రాంత గిరిజనుల చిరకాల కోరిక అయిన ఏజెన్సీ ప్రాంతంలో విలీనం అంశానికి సంబంధించి అవసరమైన చర్యలు చేపట్టినట్టు గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి అసెంబ్లీలో ప్రకటించారు. దీంతో మైదానప్రాంత గిరిజన గ్రామాలు ఐదో షెడ్యూల్‌లోని ఏజెన్సీలో విలీనానికి మార్గం సుగమమైంది.

నాలుగేళ్ల క్రితం నాటి వైసీపీ ప్రభుత్వం హయాంలో గిరిజన సలహా మండలిలోని ఎస్టీ ఎమ్మెల్యేలు మైదాన ప్రాంతంలోని గిరిజన గ్రామాలను ఏజెన్సీలో విలీనం చేయిస్తామని హడావిడి చేశారు. ఈ మేరకు రావికమతం, రోలుగుంట, మాడుగుల, చీడికాడ, దేవరాపల్లి, కోటవురట్ల, గొలుగొండ, నాతవరం మండలాల్లో 50 శాతానికి పైగా గిరిజనులు నివసిస్తున్న గ్రామాలను గుర్తించారు. ఈ మేరకు సుమారు 200 గ్రామాలను ఏజెన్సీలో విలీనం చేయడానికి ప్రతిపాదనలు కూడా రూపొందించారు. ఆయా ఆవాస ప్రాంతాల్లో గ్రామసభలు నిర్వహించి, తీర్మానాలు చేసి ప్రభుత్వానికి పంపించారు. వీటిని అసెంబ్లీలో ఆమోదించి, కేంద్రానికి పంపించవలసిన సమయంలో.. మైనింగ్ మాఫియా, రియల్ ఎస్టేట్ వ్యాపారులు తెరవెనుక చక్రం తిప్పారు. దీంతో గిరిజన గ్రామాలు ఏజెన్సీలో విలీనం చేసే అంశం మరుగున పడింది. అంతేకాక నాడు అధికారులు రూపొందించిన జాబితాలోని పలు గ్రామాలను ఏజెన్సీలో విలీనం చేయడంపై అప్పటి అధికార పార్టీ ఎమ్మెల్యేలు అభ్యంతరాలు వ్యక్తం చేయడంతో 200 గ్రామాలను 114 గ్రామాలకు కుందించారు. అయినప్పటికీ కేంద్ర ప్రభుత్వ ఆమోదం కోసం వైసీపీ ప్రభుత్వం పంపలేదు. మైదాన ప్రాంతంలోని గిరిజన గ్రామాల్లో వేలాది ఎకరాలను కొనుగోలు చేసిన బడాబాబులు, రియల్‌ఎస్టేట్ వ్యాపారుల ఒత్తిళ్లే ఇందుకు కారణమన్న ఆరోపణలు వచ్చాయి. గిరిజన సలహా మండలి సభ్యులైన ఎస్టీ ఎమ్మెల్యే కూడా ఈ అంశాన్ని తీవ్రంగా పరిగణించకపోవడంతో మైదాన ప్రాంతంలోని గిరిజన గ్రామాల్లో ఏజెన్సీలో విలీనం చేసే అంశం ప్రతిపాదనలకే పరిమితమైంది.

గత వైసీపీ ప్రభుత్వం జిల్లా పునర్విభజనలో భాగంగా ఏజెన్సీ ప్రాంతాన్ని పాడేరు కేంద్రంగా అల్లూరి సీతారామరాజు పేరుతో కొత్త జిల్లా ఏర్పాటు చేయడంతో మైదానప్రాంతంలోని గిరిజన గ్రామాలను ఆ జిల్లాలో చేరుస్తారని అప్పట్లో ప్రచారం జరిగింది. కానీ ఏ నిర్ణయం లేకుండానే వైసీపీ ప్రభుత్వం నాటి పాడేరు డివిజన్‌ను మాత్రమే కొత్త జిల్లాలో చేర్చింది. దీంతో మైదానప్రాంత గిరిజనులు తీవ్ర నిరాశ చెందారు. తాజాగా కూటమి ప్రభుత్వం మైదాన ప్రాంతంలోని గిరిజన గ్రామాలను ఏజెన్సీలో విలీనం చేయడంపై సానుకూలంగా వుంది. ఆయా గ్రామాల్లో గిరిజనుల జనాభా వివరాలను పంపించాలంటూ ఆదేశాలు ఇచ్చింది. దీంతో తమ చిరకాల కోర్కె నెరవేరుతుందని మైదాన ప్రాంత గ్రామాల గిరిజనుల ఆశగా ఎదురుచూస్తున్నారు.

అభివృద్ధికి ఆమడ దూరం..

అల్లూరి సీతారామరాజు జిల్లాను ఆనుకొని అనకాపల్లి జిల్లాలో వున్న వందలాది గిరిజన గ్రామాలకు కనీస సదుపాయాలు లేవు. తాగునీరు, విద్య, వైద్యం, విద్యుత్తు, రహదారి వంటి సదుపాయాలు అరకొరగానే వున్నాయి. కనీసం ఉపాధి హామీ పథకం కింద పనులు చేద్దామన్నా సాగునీటి వనరులు లేవు. దీంతో అడవులపై ఆధారపడి, వ్యవసాయ, అటవీ ఉత్పత్తులను అమ్ముకుంటూ, వచ్చే అరకొర ఆదాయంతోనే జీవనం సాగిస్తున్నారు. అటు ఐటీడీఏలో విలీనం చేయక, ఇటు మైదాన ప్రాంత అధికారులు పట్టించుకోక.. తమ పని రెంటికీ చెడ్డ రేవడిలా తయారైందని ఆదివాసీలు వాపోతున్నారు. దేవరాపల్లి, రావికమతం, మాడుగుల మండలాల్లోని పలు గ్రామాలకు ఇప్పటికీ విద్యుత్తు, రహదారి సౌకర్యాలు లేవు. చదువులు అంతంతమాత్రమే. మైదాన ప్రాంతంలో వుండడంతో ఏజెన్సీలో రిజర్వేషన్లు వీరికి వర్తించవు. మైదాన ప్రాంతంలో ఇతర షెడ్యూల్డు కులాల వారితో వీరు పోటీ పడలేకపోతున్నారు. ఐటీడీఏ ద్వారా ... మిగతా 4వ పేజీలో

రాజాధిరాజ వాహనంపై దేవదేవుడు

నక్కపల్లి, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి):

బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఉపమాక క్షేత్రంలో గురువారం రాజాధిరాజ వాహనంపై ఉభయదేవేరులతో శ్రీవారి తిరువీధి సేవ ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా పలువురు భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. అంతకుముందు ప్రధానార్చకులు గొట్టుముక్కల ప్రసాదాచార్యులు, అర్చకులు ఆలయంలో నిత్య పూజలు, హోమాలు చేశారు.

పరిశ్రమల ఏర్పాటుకు సత్వర చర్యలు

పెండింగ్ దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలి

- అధికారులకు కలెక్టర్ విజయకృష్ణన్ ఆదేశం

అనకాపల్లి కలెక్టరేట్, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి):



సమావేశంలో కలెక్టర్ విజయకృష్ణన్

జిల్లాలో కొత్త పరిశ్రమల ఏర్పాటుకు సత్వరమే చర్యలు చేపట్టాలని కలెక్టర్ విజయకృష్ణన్ అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లో జిల్లా పరిశ్రమలు, ఎగుమతుల ప్రోత్సాహక కమిటీ (డీఐఈపీసీ) 16వ జిల్లాస్థాయి సమావేశం కలెక్టర్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా గత సమావేశంలో చర్చించిన అంశాలపై తీసుకున్న చర్యలను జిల్లా పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ వీకేపీ ప్రసాద్, ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ ఎం.నరసింహారావు వివరించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ, గత జూలై 29న జరిగిన సమావేశం తరువాత నుంచి ఇప్పటి వరకు వివిధ శాఖల అనుమతి కోసం 1,573 దరఖాస్తులు రాగా, వాటిలో 1,462 దరఖాస్తులను ఆమోదించామని ఆమె తెలిపారు. వివిధ శాఖల అధికారులతో మాట్లాడి మిగిలిన దరఖాస్తులను త్వరగా ఆమోదించాలని ఆదేశించారు. జిల్లాలో 12 పరిశ్రమలకు సంబంధించిన వివిధ రాయితీల కోసం 21 దరఖాస్తులు రాగా రూ.7.46 కోట్ల విడుదలకు కమిటీ సమావేశంలో ఆమోదం తెలిపామన్నారు. నక్కపల్లిలో నూతనంగా పారిశ్రామిక పార్క్ ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందని కలెక్టర్ తెలిపారు. జిల్లాలో కొత్తగా 46 భారీ, అతి భారీ పరిశ్రమల స్థాపనకు ప్రతిపాదనలు వివిధ దశల్లో ఉన్నాయని వీటి ద్వారా రూ.2,89,161.85 కోట్ల పెట్టుబడులు, 1,56,556 మందికి ఉద్యోగ, ఉపాధి కల్పించే అవకాశాలు ఉన్నాయన్నారు. ఈ సమావేశంలో జిల్లా కాలుష్య నియంత్రణ మండలి ఈఈ ముకుందరావు తదితరులు పాల్గొన్నారు.

వైరస్‌ను తట్టుకునే చెరకు రకాలను రూపొందించాలి

- ఆర్ఏఆర్ఎస్ శాస్త్రవేత్తలకు ఏఐఎస్‌సీఆర్‌పీ పరిశీలకుల సూచన



పరిశోధన స్థానంలో చెరకు రకాలను పరిశీలిస్తున్న సమన్వయ పరిశోధన పథకం పరిశీలకులు

అనకాపల్లి అగ్రికల్చర్, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి):

పసుపు ఆకు వంటి వైరస్‌లను తట్టుకొనేలా మేలైన చెరకు రకాలను రూపొందించాలని అఖిల భారత చెరకు సమన్వయ పరిశోధనా పథకం (ఏఐఎస్‌సీఆర్‌పీ) పరిశీలకులు, స్థానిక ఆర్ఏఆర్ఎస్ శాస్త్రవేత్తలను కోరారు. సమన్వయ పరిశోధన పథకం పరిశీలకులు డాక్టర్ డి.శశికుమార్, డాక్టర్ వి.చంద్రశేఖర్, డాక్టర్ ఎస్.కె.యాదవ్, డాక్టర్ అనిల్‌కుమార్‌ల బృందం గురువారం అనకాపల్లి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన కేంద్రాన్ని సందర్శించింది. సమన్వయ పరిశోధన పథకం కింద పరిశోధనలు చేస్తున్న శాస్త్రవేత్తలతో వీరు సమావేశమయ్యారు. పరిశోధనలపై మూల్యాంకనం నిర్వహించారు. తెగుళ్లను, వైరస్‌లను తట్టుకొని, అధిక దిగుబడులు సాధించే చెరకు రకాలపై పరిశోధనలు ముమ్మరం కావాలని సూచించారు. చెరకు పరిశోధన క్షేత్రాలను సందర్శించి సంతృప్తి వ్యక్తం చేశారు. అనకాపల్లిలో జరుగుతున్న చెరకు పరిశోధనల ప్రగతిని వీరు సమీక్షించారు. వివిధ వాతావరణ వ్యవసాయ జోన్‌లలో చెరకు ఉత్పత్తి, పంట సంరక్షణ కార్యక్రమాలను వివరించారు. వీరి వెంట ఏడీఆర్ డాక్టర్ సిహెచ్.ముకుందరావు, ప్రధాన శాస్త్రవేత్తలు డాక్టర్ డి.ఆదిలక్ష్మి, డాక్టర్ బి.భవాని, తదితరులు వున్నారు.

మినీవ్యాన్ ఢీకొని బాలుడి మృతి

- దసరా సెలవులకు తాతయ్య ఇంటికి వచ్చి తిరిగిరాని లోకాలకు..



జయంత్ (ఫైల్ ఫొటో)

మాడుగుల రూరల్, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి):

దసరా సెలవుల్లో తాత, నానమ్మల వద్ద సరదాగా గడపడానికి వచ్చిన బాలుడిని వ్యాన్ రూపంలో వచ్చిన మృత్యువు కబళించింది. మాడుగులలోని జగ్గన్నచావిడి వద్ద గురువారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆరేళ్ల బాలుడు తీవ్రంగా గాయపడి మృతిచెందాడు. పోలీసులు, బాలుడి కుటుంబ సభ్యులు అందించిన సమాచారం మేరకు వివరాలిలా వున్నాయి.

మాడుగుల గ్రామానికి చెందిన గుంపాన అచ్యుతరావు ఉపాధి నిమిత్తం విశాఖ నగరంలోని నరవ ప్రాంతానికి వలస వెళ్లి, భార్య పిల్లలతో నివాసం వుంటున్నాడు. అచ్యుతరావు చిన్న కుమారుడు జయంత్(6) రెండో తరగతి చదువుతున్నాడు. దసరా పండుగ సందర్భంగా పాఠశాలకు సెలవులు ఇవ్వడంతో జయంత్ బుధవారం విశాఖ నుంచి మాడుగులలోని జగ్గన్నచావిడి వీధిలో నివాసం వుంటున్న తాత అప్పారావు (అచ్యుతరావు తండ్రి) ఇంటికి వచ్చాడు. గురువారం ఉదయం పది గంటల సమయంలో ఆడుకునేందుకు జయంత్ వీధిలో నుంచి రోడ్డుపైకి వస్తున్న క్రమంలో మినీవ్యాన్ ఢీకొన్నది. జయంత్ రోడ్డుపై తుళ్లి పడిపోవడంతో తలవెనుక బాగంలో తీవ్ర గాయమైంది. కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం స్థానిక సీహెచ్‌సీకి తీసుకెళ్లారు. జయంత్‌ను పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతిచెందినట్టు నిర్ధారించారు. సమాచారం అందుకున్న తల్లిదండ్రులు హుటాహుటిన మాడుగుల చేరుకున్నారు. కుమారుడి మృతదేహాన్ని చూసి కన్నీరుమున్నీరయ్యారు. కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ నారాయణరావు తెలిపారు.

ఆక్రమణలో పంచాయతీ స్థలాలు

'పేటలో దర్జాగా ఇళ్లు, దుకాణాల నిర్మాణం

- ఏళ్ల తరబడి సాగుతున్నా పట్టించుకోని వైనం
- విజిలెన్స్ విచారణకు హోం మంత్రి ఆదేశాలు
- అయినా స్పందించని పంచాయతీ అధికారులు

పాయకరావుపేట, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి):

స్థానిక ఎమ్మెల్యే. రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత ఆదేశాలతో పట్టణంలోని పలు లేఅవుట్లలో సర్వే చేసి పంచాయతీ స్థలాలను గుర్తిస్తున్న అధికారులు.. పంచాయతీ స్థలాల్లో ఇళ్లు, దుకాణాలు నిర్మించుకున్న వారిని మాత్రం ఖాళీ చేయించడంలేదు. ఆక్రమణలు, అక్రమ నిర్మాణాలపై పత్రికల్లో కథనాలు వస్తే.. ఆయా స్థలాలను స్వాధీనం చేసుకుంటామని అధికారులు ప్రకటించడమే తప్ప, అమలు చేయడంలేదు.



పీఆర్ అతిథిగృహం ఎదుట పంచాయతీ స్థలంలో సిమెంటు తూరల వ్యాపారం



విద్యుత్ సబ్‌స్టేషన్‌ను అనుకుని పంచాయతీ స్థలంలో నిర్మించిన ఇళ్లు

పాయకరావుపేట పంచాయతీలో ఇప్పటి వరకు వేసిన 60 లేఅవుట్లలో రెండు మినహా మిగిలినవన్నీ వీఎంఆర్డీఏ నిబంధనలకు విరుద్ధంగా వేసినట్టు అధికారులు గుర్తించారు. లేఅవుట్లకు పంచాయతీ నుంచి అనుమతులు తీసుకున్న సమయంలో సామాజిక అవసరాల నిమిత్తం విడిచిపెట్టిన స్థలాలుగా ఒక్కొక్కటిగా అన్యాక్రాంతం అవుతున్నాయి. ఈ స్థలాలను ఆయా లేఅవుట్లు వేసిన వ్యక్తులు అమ్ముకోవడం లేదా అన్యులు ఆక్రమించుకోవడం జరుగుతున్నాయి. వీటిపై పత్రికల్లో కథనాలు వస్తున్నా.. అధికారులు పట్టించుకోవడంలేదు. ఈ నేపథ్యంలో నెల రోజుల క్రితం రాజుగారిబీడులోని పంచాయతీ స్థలంలో ఇతరు ప్రహరీగోడ కడుతున్న వైనంపై మంత్రి వంగలపూడి అనిత స్పందించారు. ఆమె ఆదేశాలతో పంచాయతీ అధికారులు ప్రహరీగోడను తొలగించారు. అంతేకాక పట్టణంలోని పలు లేఅవుట్లలో పంచాయతీకి దఖలుపడిన స్థలాల క్రయ విక్రయాలపై ఫిర్యాదులు వస్తుండడంతో మంత్రి అనిత మరో సారి స్పందించారు. అక్రమ లేఅవుట్లు, పంచాయతీ స్థలాల ఆక్రమణలపై విజిలెన్స్ విచారణకు ఆదేశిస్తున్నట్టు ప్రకటించారు. జిల్లా పంచాయతీ అధికారి ఆదేశాల మేరకు స్థానిక పంచాయతీ అధికారులు పట్టణంలోని పలు లేఅవుట్లలో పంచాయతీ స్థలాలను గుర్తించి హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేస్తున్నారు. అయితే పలు లేఅవుట్లలో పంచాయతీకి దఖలుపడిన స్థలాలను ఆక్రమించడంతోపాటు వాటిలో దర్జాగా ఇళ్లు, దుకాణాలు ... మిగతా 4వ పేజీలో

ఏయూలో ఉద్రిక్తత

హాస్టల్ విద్యార్థి మృతి

- సకాలంలో చికిత్స అందకపోవడమే కారణమని విద్యార్థి సంఘాల ఆందోళన

- ప్రధాన ద్వారం ఎదుట బైఠాయింపు
- వీసీ చాంబర్‌లోకి దూసుకెళ్లిన విద్యార్థులు
- రాజీనామా చేయాలని డిమాండ్
- నేడు బంద్‌కు పిలుపు



క్యాంపస్‌లో సమస్యలపై వీసీ రాజశేఖర్‌ను ప్రశ్నిస్తున్న విద్యార్థులు



మృతిచెందిన విద్యార్థి మణికంఠ (ఫైల్ ఫొటో)

విశాఖపట్నం, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి):

ఆంధ్ర విశ్వవిద్యాలయం హాస్టల్ విద్యార్థి సకాలంలో చికిత్స అందక గురువారం ఉదయం మరణించాడు. దీనిపై అధికారులు సరిగ్గా స్పందించకపోవడంతో విద్యార్థులు ఆందోళనకు దిగారు. తమ సమస్యలు పట్టించుకోని వైస్ చాన్సలర్ రాజశేఖర్ రాజీనామా చేయాలంటూ ఆయన ఛాంబర్‌లోకి దూసుకువెళ్లారు. వీసీకి ప్రొఫెసర్లు, పోలీసులు రక్షణ కల్పించారు. ఈ ఆందోళన రాత్రి 7.30 గంటల వరకూ కొనసాగింది. శుక్రవారం యూనివర్సిటీ బంద్ చేయాలని విద్యార్థి సంఘ నాయకులు పిలుపునిచ్చారు.

బ్రష్ చేయడానికి వెళ్లి పోడిపోయాడు

విజయనగరానికి చెందిన వింజమూరి వెంకట సాయి మణికంఠ (25) యూనివర్సిటీలో బీఈడీ రెండో సంవత్సరం చదువుతూ క్యాంపస్‌లోని శాతవాహన హాస్టల్‌లో ఉంటున్నాడు. గురువారం ఉదయం 7.30 గంటల ప్రాంతంలో బ్రష్ చేసుకోవడానికి వాష్‌రూమ్‌కు వెళ్లి జారి పడిపోయాడు. ఊపిరి అందక గిలగిలలాడాడు. ఈ విషయం గుర్తించిన తోటి విద్యార్థులు వెంటనే యూనివర్సిటీ ఆవరణలో ఉన్న డిస్పెన్సరీకి ఫోన్ చేసి అంబులెన్స్‌ను రప్పించారు. తనకు ఊపిరి ఆడడం లేదని, ఆక్సిజన్ పెట్టాలని మణికంఠ కోరాడు. అయితే అంబులెన్స్‌లో ఆ ఏర్పాట్లు లేకపోవడంతో కేజీహెచ్‌కు తీసుకువెళ్లారు. వైద్యులు ప్రాథమిక చికిత్స అందించే ప్రయత్నం చేయగా.. అప్పటికే అతను మరణించినట్టు గుర్తించి, మిత్రులకు తెలియజేశారు. అంబులెన్స్‌లో వెంటనే ఆక్సిజన్ పెట్టి ఉంటే చనిపోయేవాడు కాదని వారు తెలిపారు.

వీసీ కార్యాలయం ఎదుట ఆందోళన

మణికంఠ ఆక్సిజన్ అందకే చనిపోయాడని వైద్యులు చెప్పడంతో విద్యార్థులు వర్సిటీ ప్రధాన గేటు వద్ద ఆందోళనకు దిగారు. డిస్పెన్సరీలో వైద్యం అందడం లేదని, వసతులు లేవని వీసీకి గతంలో పలుమార్లు ... మిగతా 4వ పేజీలో

తాచేరు గెడ్డలో పడి రైతు మృతి

బుచ్చెయ్యపేట, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి):



కాళ్ల సుబ్బారావు (ఫైల్ ఫొటో)

మండలంలోని విజయరామరాజుపేట వద్ద తాచేరు కాజ్‌వే దాటుతూ ఒక రైతు నీటిలో కొట్టుకుపోయి మృతిచెందాడు. ఇందుకు సంబంధించి కుటుంబ సభ్యులు, పోలీసులు తెలిపిన వివరాలిలా వున్నాయి.

వడ్డాదికి చెందిన కాళ్ల సుబ్బారావు (70) బుధవారం మధ్యాహ్నం తరువాత తాచేరు గెడ్డకు అవతలవైపు వున్న పశువుల పాకల వద్దకు బయలుదేరాడు. విజయరామరాజుపేట వద్ద ధ్వంసమైన కాజ్‌వేను ఒక వైరు సాయంతో దాటాడు. సాయంత్రం తిగిరి ఇంటికి వచ్చే క్రమంలో కాజ్‌వే వద్ద పట్టుతప్పి నీటిలో పడి కొట్టుకుపోయాడు. ఈ సమయంలో అక్కడ ఎవరూ లేకపోవడంతో కాపాడలేకపోయారు. సుబ్బారావు చీకటి పడిన తరువాత ఇంటికి రాకపోవడంతో పశువుల పాకవద్దనే వుండి వుంటాడని కుటుంబ సభ్యులు భావించారు. గురువారం ఉదయం కూడా ఇంటికి రాకపోవడంతో పశువుల పాక వద్దకువెళ్లి చూశారు. అక్కడ కనిపించకపోవడంతో ఆందోళన చెందిన తాచేరు గెడ్డలో గాలింపు చర్యలు చేపట్టారు. కాజ్‌వేకు సుమారు 100 మీటర్ల దూరంలో ... మిగతా 4వ పేజీలో

అసెంబ్లీ సమావేశాల తర్వాత కలుస్తా

రాజయ్యపేట గ్రామస్థులకు మంత్రి అనిత వీడియో సందేశం

నక్కపల్లి, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రాజయ్యపేట గ్రామస్థులు బల్క్‌డ్రగ్‌పై చేస్తున్న ఆందోళన తన దృష్టికి వచ్చిందని, అసెంబ్లీ సమావేశాల అనంతరం వచ్చి కలుస్తానని రాష్ట్ర హోం శాఖా మంత్రి వంగలపూడి అనిత హామీ ఇచ్చారు. ఈ మేరకు గురువారం ఆమె గ్రామస్థులకు వీడియో సందేశాన్ని పంపారు. మీ అందరి ఆశీస్సులతోనే ఎమ్మెల్యేగా గెలిచి మంత్రినయ్యానని, గతంలో కూడా బల్క్‌డ్రగ్ పార్కుకు సంబంధించి మీతో రెండు, మూడు పర్యాయాలు సమావేశమైన విషయాన్ని ఆమె గుర్తు చేశారు. అవసరమైతే మత్స్యకారులతో ఒక కమిటీ ఏర్పాటు చేసి, సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళతానని హామీ ఇచ్చారు.

నేడు నాగులాపల్లి సొసైటీ సర్వసభ్య సమావేశం

మునగపాక, సెప్టెంబర్ 25 (ఆంధ్రజ్యోతి): మండలంలో నాగులాపల్లి సొసైటీ సర్వసభ్య సమావేశం ఈనెల 26వ తేదీన జరగనుందని సీఈవో మళ్ల స్వామి తెలిపారు. సొసైటీ ఛైర్‌పర్సన్ యల్లపు వెంకటభాస్కరరావు అధ్యక్షతన సమావేశం జరుగుతుందని చెప్పారు. 2024-25 వార్షిక నివేదిక, బడ్జెట్ ఆమోదం వంటి అంశాలు సమావేశంలో చర్చకు వస్తాయన్నారు.

బల్క్‌డ్రగ్‌పై కొనసాగుతున్న ఆందోళన

నక్కపల్లి, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రాజయ్యపేటలో బల్క్‌డ్రగ్‌పై చేపట్టిన నిరసన గురువారం కూడా కొనసాగింది. గురువారం దీక్షా శిబిరం వద్దే వంటా-వార్పు చేసి భోజనాలు చేశారు. మత్స్యకారుల దీక్షా శిబిరాన్ని వైసీపీ నేత వీసం రామకృష్ణ సందర్శించి మద్దతు ప్రకటించారు. బల్క్‌డ్రగ్ పార్కును రద్దు చేసే వరకూ పోరాటం కొనసాగుతుందని సీపీఎం నేత అప్పలరాజు ప్రకటించారు. ఒకానొకదశలో పోలీసులు,మత్స్యకారులకు మధ్య బుధవారం రాత్రి వాగ్వాదం కూడా చోటుచేసుకుంది.

మంత్రి నారాయణ, స్పీకర్ అయ్యన్నలను కలిసిన ప్రగడ



మంత్రి నారాయణ, స్పీకర్ అయ్యన్నలను కలిసిన ప్రగడ నాగేశ్వరరావు

ఎలమంచిలి, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): మునిసిపల్ శాఖా మంత్రి పొంగూరు నారాయణను, స్పీకర్ అయ్యన్నపాత్రులను విజయవాడలో రాష్ట్ర రహదారుల అభివృద్ధి కార్పొరేషన్ ఛైర్మన్ ప్రగడ నాగేశ్వరరావు మర్యాదపూర్వకంగా కలిశారు. మంత్రి నారాయణను ఎలమంచిలి మునిసిపాలిటీ అభివృద్ధికి మరిన్ని నిధులు కేటాయించాలని కోరినట్టు తెలిపారు. ఇటీవల అకాల వర్షాల కారణంగా దెబ్బతిన్న విద్యుత్, డ్రైనేజీ వ్యవస్థలను మెరుగుపరిచేందుకు ప్రత్యేక చొరవ చూపాలని కోరారు. స్పీకర్ అయ్యన్నపాత్రుతో ఎలమంచిలి అభివృద్ధిపై చర్చించారు.

స్పేసెస్ డిగ్రీ కళాశాలలో ఘనంగా దసరా వేడుకలు

పాయకరావుపేట, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): స్థానిక స్పేసెస్ డిగ్రీ కళాశాలలో గురువారం ముందస్తు విజయదశమి వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా విద్యార్థినులు సంప్రదాయ దుస్తులు ధరించి, కనకదుర్గ అమ్మవారి చిత్రపటానికి విశేష పూజలు నిర్వహించారు. అనంతరం విద్యార్థినుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.రామకృష్ణారెడ్డి, అధ్యాపకులు పాల్గొన్నారు.

28న ఎస్పీ బాలు పాటలతో సంగీత విభావరి

ఎలమంచిలి, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): గాన గంధర్వుడు ఎస్పీ. బాలసుబ్రహ్మణ్యం వర్ధంతిని పురస్కరించుకుని ఎలమంచిలిలో ఈనెల 28వ తేదీన నిర్వహించే సినీ సంగీత విభావరి పోస్టర్‌ను గురువారం అధ్యక్షుడు మత్తుర్తి రామారావు ఆవిష్కరించారు. పట్టణంలోని గురవప్ప కల్యాణ మండపంలో సాయంత్రం 3 గంటల నుంచి జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని రామారావు కోరారు. ఈ కార్యక్రమంలో విశ్రాంత ఉద్యోగి ఆడారి అప్పారావు, యల్లపు పైడికొండ, బీముని సత్యనారాయణ, షేక్ అబ్దుల్లా, కిర్లంపల్లి మహేష్ పాల్గొన్నారు.

జగన్‌ని కలిసిన బొడ్డేడ ప్రసాద్



మునగపాక, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): వైసీపీ అధినేత వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డిని తాడేపల్లి క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసినట్టు వైసీపీ రాష్ట్ర కార్యదర్శి బొడ్డేడ ప్రసాద్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. కూటమి ప్రభుత్వం అమలు చేయని హామీలపై ఒత్తిడి చేసే కార్యక్రమాలు చేపట్టాలని జగన్ సూచించారని ఆయన తెలిపారు.

చినదొడ్డిగల్లులో బోనాల జాతర

నక్కపల్లి, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చినదొడ్డిగల్లులో శరన్నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా గురువారం దుర్గాదేవి బోనాల ఊరేగింపు ఘనంగా జరిగింది. కొండపై వున్న దుర్గాదేవి ఆలయంలో ముందుగా ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం మహిళా భక్తులు బోనాలను ఊరేగింపుగా తీసుకెళ్లి అమ్మవారికి సమర్పించారు. భక్తులకు అన్న ప్రసాదాలు పంపిణీ చేశారు.

నేడు మునిసిపాలిటీలో విద్యుత్ సరఫరా నిలిపివేత

ఎలమంచిలి, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): ఎలమంచిలి సబ్‌స్టేషన్ పరిధిలోని విద్యుత్ లైన్ల నిర్వహణ పనుల్లో భాగంగా శుక్రవారం ఉదయం 8 నుంచి 2 గంటల వరకు కొన్ని ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని ఈపీడీసీఎల్ అనకాపల్లి ఈఈ రాజశేఖర్ ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణంలోని ధర్మవరం, సైతారుపేట రోడ్డు, కట్టుపాలెం, పాతవీధి, కొత్తపాలెం, సోమలింగపాలెం, రామారాయుడుపాలెం ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు గమనించాలని తెలిపారు.

గ్రామాభివృద్ధిలో సర్పంచుల పాత్ర కీలకం : ఎంపీడీవో

నక్కపల్లి, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): గ్రామాల అభివృద్ధిలో సర్పంచుల పాత్ర ఎంతో కీలకమని ఎంపీడీవో డీ సీతారామరాజు సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో గురువారం రెండో రోజు సర్పంచుల శిక్షణ తరగతుల్లో ఆయన మాట్లాడారు. గ్రామాల అభివృద్ధికి ప్రణాళికలను రూపొందించుకోవాలని, పరిశుభ్రత, తాగునీటికి ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. పంచాయతీల ఆర్థిక వనరులను ఎలా వృద్ధి చేసుకోవాలో ఆలోచన చేసి, అందుకు నిరంతరం కృషి చేయాలన్నారు. డిప్యూటీ ఎంపీడీవో చలపతిరావు, నక్కపల్లి, పాయకరావుపేట మండలాల సెక్రటరీలు, సర్పంచులు పాల్గొన్నారు.

కోటవురట్ల సొసైటీ సర్వసభ్య సమావేశం రేపు

కోటవురట్ల, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): ఈనెల 27వ తేదీన కోటవురట్ల సహకార సంఘం సర్వసభ్య సమావేశాన్ని నిర్వహిస్తున్నట్టు సొసైటీ పర్సన్‌ఇన్‌చార్జి వేచలపు జనార్దన్ తెలిపారు. గురువారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ శనివారం జరగనున్న సమావేశానికి మంత్రి అనిత ముఖ్యఅతిథిగా హాజరవుతున్నట్టు చెప్పారు. సమావేశానికి రైతులు హాజరుకావాలన్నారు.

ఘనంగా దీనదయాళ్ ఉపాధ్యాయ జయంతి

రాంబిల్లి, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వాడనర్సాపురంలో గురువారం భారతీయ జనతా పార్టీ సిద్ధాంతకర్త దీనదయాళ్ ఉపాధ్యాయ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు కారే రాముడు, బీజేపీ నాయకులు ధర్మాల గోవిందరెడ్డి, ఎస్. ధర్మతేజ, రవితేజ, గగన్ కుమార్, బద్ది మురళి, ధర్మాల సత్యనారాయణ, ఎస్. నూకరాజు తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించిన తర్వాతే గ్రామాన్ని తరలించాలి

- కృష్ణంపాలెం ఎస్ఈజడ్ నిర్వాసితులు స్పష్టీకరణ
- ఇళ్లను తొలగింపును అడ్డుకున్న గ్రామస్థులు

రాంబిల్లి, సెప్టెంబర్లు 25 (ఆంధ్రజ్యోతి): ఎస్ఈజడ్ ఏర్పాటుకు భూములు, ఇళ్లు ఇచ్చిన తమ సమస్యలను పరిష్కరించిన తరువాతే గ్రామాన్ని తరలించాలని కృష్ణపాలెం నిర్వాసితులు స్పష్టం చేశారు. గురువారం గ్రామంలోని ఇళ్లను తొలగించేందుకు వచ్చిన రెవెన్యూ అధికారులు, సిబ్బందిని వారు అడ్డుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎస్ఈజడ్ ఏర్పాటుకు 18 ఏళ్ల క్రితం భూములు, ఇళ్లు తీసుకున్నారని, నేటికీ సమస్యలు పూర్తిగా పరిష్కరించలేదన్నారు. గ్రామాన్ని తరలించకుండా ఇళ్లను తొలగించేందుకు రావడం ఎంతవరకు న్యాయమని నిలదీశారు. మా ఇళ్లను తొలగిస్తే.. మేము ఎక్కడ ఉండాలో, ఎలా బతకాలో చెప్పాలని ప్రశ్నించారు. తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ హైకోర్టును ఆశ్రయించామన్నారు. కేసు కోర్టులో నడుస్తున్న తరుణంలో అధికారులు ఎటువంటి సమాచారం ఇవ్వకుండా కొందరి నిర్వాసితులకు ఖాతాలకు ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ నగదును జమచేశారన్నారు. దీంతో చేసేది లేక అధికారులు వెనుదిరిగారు.



తహశీల్దార్ శ్రీనివాసరావుకు సమస్యలను తెలియజేస్తున్న నిర్వాసితులు

వరిలో పొటాష్ లోపం

శాస్త్రవేత్త కేవీ రమణమూర్తి

మునగపాక, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): మునగపాక పేటకట్టు రైతు సంఘం ప్రాంతం, తిమ్మరాజుపేటలో గురువారం పలువురు శాస్త్రవేత్తలు పర్యటించారు. ఈ సందర్భంగా వరి, చెరకు పంటలను క్షుణంగా పరిశీలించారు. అనంతరం శాస్త్రవేత్తలు కేవీ.రమణమూర్తి, పీవీ.పద్మావతి మాట్లాడుతూ చాలా వరకు వరి పంటలు పొటాష్ లోపం కలిగి ఉన్నాయని, మరి కొన్నిచోట్ల పొడ, ఆకుముడత తెగుళ్ల సోకాయన్నారు చెప్పారు. అదేవిధంగా చెరకు పంటకు నల్లి సోకిందని తెలిపారు. పొటాష్ లోపం కలిగిన వరి పంటకు ఎకరాకు 20 నుంచి 25 కేజీలు చొప్పున పొటాష్ వేసుకోవాలన్నారు. పొడ తెగులు నివారణకు ప్రొపికోనజోల్ ఎకరానికి 250 ఎం.ఎల్, ఆకుముడత నివారణకు కార్టప్ హైడ్రోక్లోరైడ్ 400 గ్రాములు చొప్పున ఎకరాకు పిచికారీ చేయాలన్నారు. చెరకులో నల్లి నివారణకు డైమెతోట్ 400 ఎం.ఎల్ చొప్పున పిచికారీ చేయాలన్నారు. కార్యక్రమంలో ఎన్.రాజ్‌కుమార్, ఏఈవోలు లక్ష్మి, పద్మిని, వీఏఏ సరిత, రైతులు, రైతు సంఘం ప్రతినిధులు ఆడారి మహేశ్వరరావు, లక్ష్మణరావు, బొడ్డేడ రాజు, నాగేశ్వరరావు పాల్గొన్నారు.



తిమ్మరాజుపేటలో వరి పొలాలను పరిశీలిస్తున్న వ్యవసాయ శాస్త్రవేత్తలు

వైసీపీ పాలకులు టీటీడీని వ్యాపార సంస్థగా మార్చేశారు

- టీటీడీ మాజీ ఛైర్మన్ పప్పల చలపతిరావు

ఎలమంచిలి, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): ఎంతో పవిత్రమైన తిరుమల తిరుపతి దేవస్థానాన్ని వైసీపీ పాలకులు వ్యాపార సంస్థగా మార్చేశారని టీటీడీ మాజీ ఛైర్మన్ పప్పల చలపతిరావు అన్నారు. గురువారం పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో ఆయన టీడీపీ నేతలతో కలిసి మహా పాపం పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తిరుపతి వేంకటేశ్వరస్వామిని దర్శనం చేసుకునే భక్తులకు మెరుగైన సేవలు అందించేలా తెలుగుదేశం ప్రభుత్వం హయాంలో తీర్చిదిద్దడం జరిగిందన్నారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో తిరుపతిని వ్యాపార సంస్థగా వినియోగించుకోవడాన్ని భక్తులంతా గమనించారన్నారు. స్వామి ప్రసాదం లడ్డూలో వినియోగించే నెయ్యి విషయంలో భక్తుల మనోభావాలు దెబ్బతీసేలా వ్యవహరించడం దారుణమన్నారు. స్వామివారి పరకామణిలో దొంగతనం చేయడం టీటీడీ చరిత్రలో చీకటి ఫైలు రాయని పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత లడ్డూ ప్రసాదం నాణ్యత పెరిగిందని, వెంగమాంబ సత్రంలో అన్న సమారాధనలో మార్పు తెచ్చారన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ పట్టణ అధ్యక్షుడు గొర్లె నానాజీ, జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి రాజాన సూర్యనాగేశ్వరరావు, టీడీపీ నాయకులు ఆడారి ఆదిమూర్తి, దంట్ల వెంకటస్వామి, బొద్దపు రమణ, కరణం రవి, గొర్లె బాబూరావు, ఎస్. రమణబాబు, దాడి రమేశ్ పాల్గొన్నారు.



మహాపాపం పోస్టర్‌ను ప్రదర్శిస్తున్న పప్పల చలపతిరావు, టీడీపీ నేతలు

'మహిళ ఆరోగ్యంగా ఉంటే కుటుంబమే బాగుంటుంది'

కోటవురట్ల, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఇంటిలో మహిళ ఆరోగ్యం ఉంటే ఆ కుటుంబం అంతా ఆరోగ్యంగా ఉంటుందని కే వెంకటాపురం పీహెచ్‌సీ డాక్టర్ మౌనిక అన్నారు. గురువారం తంగేడు సచివాలయంలో స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్‌లో భాగంగా నిర్వహించిన వైద్య శిబిరాన్ని సర్పంచ్ కోరుప్రోలు శివ ప్రారంభించారు. అంగన్‌వాడీ కార్యకర్తలు పౌష్టికాహార ఎగ్జిబిషన్‌ను ఏర్పాటుచేశారు. కార్యక్రమంలో వైద్య ఆరోగ్య సిబ్బంది, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అచ్యుతాపురంలో..

మహిళల ఆరోగ్య పరిరక్షణకే స్వస్థ నారీ సశక్తి పరివార్ అభియాన్‌ని రూపొందించారని అచ్యుతాపురం సీహెచ్‌సీ వైద్యాధికారిణిలు కె శ్రావ్య, ఐ లిఖిత అన్నారు. గురువారం మడుతూరులో జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న వారు మహిళలకు వైద్యపరీక్షలు చేసి అవగాహన కల్పించారు. ఈకార్యక్రమంలో మోటూరు శ్రీవేణి, తట్టా లోవకుమారి, శనివాడ ఆనందరావు, పిల్ల వరలక్ష్మి, బలిరెడ్డి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి స్కేటింగ్ పోటీలకు హరిపాలెం విద్యార్థులు



హర్షవర్ధన్ మోహిత్

అచ్యుతాపురంరూరల్, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని హరిపాలేనికి చెందిన శరగడం హర్షవర్ధన్, శరగడం మోహిత్‌లు రాష్ట్ర స్థాయి స్కేటింగ్ పోటీలకు ఎంపికయ్యారు. ఈ నెల 21 నుంచి 23 వరకు విశాఖలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో జరిగిన అండర్-11 విభాగంలో స్పీడ్ స్కేటింగ్ పోటీల్లో వీరిద్దరూ ఉత్తమ ప్రతిభ చూపారు. రాష్ట్ర స్థాయి పోటీలకు వీరిద్దరితో పాటు మరో ఏడుగురు ఎంపికైనట్టు స్థానిక వీల్స్ ఆఫ్ ఫైర్ స్కేటింగ్ క్లబ్ శిక్షకులు ఎస్.పవన్ కుమార్, రాజేష్ తెలిపారు. వీరంతా నవంబరులో కాకినాడలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని వారు తెలిపారు.

ప్రజారంజకంగా నరేంద్ర మోదీ పాలన

- బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఆనంద్‌కుమార్



మందులు పంపిణీ చేస్తున్న బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఆనంద్‌కుమార్

ఎలమంచిలి, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): దేశాభివృద్ధే ధ్యేయంగా ప్రధాని నరేంద్ర మోదీ ప్రజారంజక పాలన సాగిస్తున్నారని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఆడారి ఆనంద్‌కుమార్ అన్నారు. గురువారం మునిసిపాలిటీలోని సోమలింగపాలెంలో ప్రధాని మోదీ జన్మదిన సేవా పక్షోత్సవాల్లో భాగంగా ఏర్పాటు చేసిన ఉచిత మెగా వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. అంతకుముందు దీన్ దయాల్ ఉపాధ్యాయ పుట్టిన రోజును పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేశారు. ఈ సందర్భంగా 408 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి, మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మునిసిపల్ ఛైర్‌పర్సన్ రమాకుమారి, కూటమి నేతలు కర్రి శివ, ఆడారి శ్రీధర్, కర్రి రూన్సీ, యల్లపు గోపి, పప్పు ఈశ్వరరావు, మళ్ల కొండబాబు పాల్గొన్నారు.

కక్ష సాధింపు వైసీపీ నైజం : టీడీపీ



మాట్లాడుతున్న టీడీపీ పట్టణ అధ్యక్షుడు యాళ్ల వరహాలబాబు

పాయకరావుపేట, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): కక్ష సాధింపు చర్యలకు పాల్పడడం వైసీపీ నైజమని టీడీపీ పట్టణ అధ్యక్షుడు యాళ్ల వరహాలబాబు అన్నారు. గురువారం పార్టీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ పాయకరావుపేట పంచాయతీ షాపుల వేలం పాటలకు సంబంధించి వైసీపీ నాయకుడు సాయిబాబా చేసిన ఆరోపణలను తీవ్రంగా ఖండించారు. పంచాయతీ ఆదాయం తగ్గిపోవడంతో హోం మంత్రి అనిత ఆదేశాలతో జిల్లా పంచాయతీ అధికారులు షాపులకు వేలం పాటలు నిర్వహించారన్నారు. పంచాయతీ నిబంధనకు విరుద్ధంగా వైసీపీ ప్రభుత్వ హయాంలో సాయిబాబా లీజుదారుల నుంచి రెండు షాపులు తీసుకుని అధిక అద్దెకు మద్యం షాపునకు ఇచ్చారన్నారు. ఇపుడు ఆ షాపులను ఇతరులకు అధిక ధరలకు అమ్ముకున్న విషయం కూడా వాస్తవం కాదా అని ప్రశ్నించారు. తప్పులు మీ వైపు ఉంచుకుని కూటమి నేతలపై బురద చల్లడం సమంజసం కాదన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు గూటూరు శ్రీనివాసరావు, గొల్లపల్లి నాగు పాల్గొన్నారు.

పరిసరాలు పరిశుభ్రం

ఎలమంచిలి, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): మునిసిపాలిటీతో పాటు మండలంలోని పురుషోత్తపురంలో గురువారం స్వచ్ఛతా హి సేవ కార్యక్రమంలో లక్కవరం పీఏసీఎస్ ఛైర్‌పర్సన్ కొలుకులూరి విజయ్‌బాబు, టీడీపీ నేత రాజాన వెంకునాయుడు రోడ్డు పక్కన తుప్పలను తొలగించారు. అదేవిధంగా పట్టణంలోని రాజీవ్‌గాంధీ క్రీడామైదానంలో ఛైర్‌పర్సన్ రమాకుమారి, వాకర్స్‌క్లబ్ సభ్యులు, మునిసిపల్ అధికారులు తుప్పలను తొలగించారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ పల్లా శ్రీనువాసరావు పాల్గొన్నారు.

ఎస్.రాయవరంలో..

మండలంలోని మేజర్ పంచాయతీ తిమ్మాపురంలో గురువారం స్వచ్ఛతా హి సేవ కార్యక్రమంలో భాగంగా పారిశుధ్య కార్మికులను స్థానిక సర్పంచ్ కర్రి సత్యనారాయణ, డిప్యూటీ ఎంపీడీవో సత్యనారాయణ సన్మానించారు. అనంతరం వారు ఇంటింటి చెత్త సేకరణను స్వయంగా పరిశీలించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నేత వంగలపూడి గోవింద్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

అచ్యుతాపురంలో..

స్వచ్ఛతా హీ సేవ, ఏక్‌దిన్, ఏక్ గంట, ఏక్‌సాత్ కార్యక్రమంలో భాగంగా గురువారం అచ్యుతాపురంలో పారిశుధ్య కార్మికులను సన్మానించారు. అనంతరం వీరికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో డీఎల్‌డీఓ నాగలక్ష్మి, ఎంపీడీఓ చిన్నారావు, ఈఓపీఆర్డీ సత్యవరాహ శ్రీనివాసరావు, సర్పంచులు కూండ్రపు వెంకునాయుడు, సంజీవి పాల్గొన్నారు.

కోటవురట్లలో..

మండలంలోని బీకేపల్లిలో స్వచ్ఛతా హీ సేవాను గురువారం నిర్వహిం చారు. ఈ సందర్భంగా అధికారులు, ప్రజా ప్రతినిధులు గ్రామంలో శ్రమదానంతో పరిశుభ్రం చేశారు. అనంతరం గ్రామసర్పంచ్ పెట్ల లింగంనాయుడు, ఎంపీడీవో చంద్రశేఖర్, డిప్యూటీ ఎంపీడీవో కూర్మరావు, కార్యదర్శి రఘురామ్ పారిశుధ్య కార్మికులను సత్కరించారు.

నక్కపల్లిలో..

మండలంలోని వేంపాడులో గురువారం ఎంపీడీవో సీతారామరాజు, డిప్యూటీ ఎంపీడీవో చలపతిరావు స్వచ్ఛతా హై సేవా కార్యక్రమంలో భాగంగా శ్రమదానం చేశారు. సచివాలయ పరిసరాలను శుభ్రం చేశారు. అనంతరం క్లాప్ మిత్రాలను ఎంపీడీవో సీతారామరాజు సన్మానించారు.

పాయకరావుపేట/రూరల్‌లో..

మండలంలోని అన్ని పంచాయతీల్లో స్వచ్ఛత హి సేవ కార్యక్రమాన్ని నిర్వహించారు. పంచాయతీ సిబ్బంది చెత్తను ఊడ్చి పరిశుభ్రం చేశారు. పాయకరావుపేటలో జరిగిన కార్యక్రమంలో టీడీపీ నాయకులు చించెలపు ప్రదీప్, యాళ్ల వరహాలబాబు, చిక్కాల శ్రీనివాసరావు, మజ్జూరి నారాయణరావు పాల్గొన్నారు. అదేవిధంగా గుంటపల్లిలో సచివాలయం పరిసరాలను శుభ్రం చేయడంతోపాటు క్లాప్‌మిత్రులను సన్మానించారు.

నేత్రపర్వంగా దుర్గమ్మ అంబలం పూజ

నక్కపల్లి, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎన్.నర్సాపురంలో బుధవారం దుర్గాదేవి అంబలం పూజ ఘనంగా జరిగింది. దుర్గాదేవి ఆలయ ప్రాంగణంలో అరటి డొప్పలతో హంసను తయారు చేశారు. అందులో వినాయకుడు, శివపార్వతులు, దుర్గాదేవి అమ్మవారిని అలంకరించారు. ఈ గ్రామానికి చెందిన చొప్పా నాగరాజు, లక్ష్మి దంపతులు నిర్వహించిన అంబలం పూజను తిలకించేందుకు అధిక సంఖ్యలో భవానీదీక్షాపరులు వచ్చారు. ఉపమాక గురుభవానీ రాంబాబు శ్రీసూక్త విధానంలో అమ్మవారి పూజను నిర్వహించారు. అనంతరం గురుభవానీలు లోవరాజు, లక్ష్మీనారాయణ, రమణ,వినోద్‌లను సత్కరించారు.

'ప్రజాభిప్రాయ సేకరణకు మద్దతివ్వాలి'

ఎస్.రాయవరం, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): స్టీల్‌ప్లాంట్ ఏర్పాటుకు నక్కపల్లిలో శనివారం జరగనున్న ప్రజాభిప్రాయ సేకరణకు ప్రతి ఒక్కరూ మద్దతివ్వాలని టీడీపీ నియోజకవర్గ కన్వీనర్ కె.వెంకటేష్ కోరారు. మండలంలోని అడ్డరోడ్డులోని శ్రీప్రజ్ఞా జూనియర్ కళాశాలలో గురువారం ఆయన విద్యార్థులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ప్రజాభిప్రాయ సేకరణలో పాల్గొని మద్దతివ్వాలంటూ ఆ కాలేజీ విద్యార్థులను ఆహ్వానించారు. అనంతరం మాట్లాడుతూ రాష్ట్ర హోం మంత్రి అనిత కృషితో రూ. లక్షా 64 వేల కోట్లతో నక్కపల్లి మండలంలో స్టీల్‌ప్లాంట్ ఏర్పాటు చేస్తున్నారన్నారు. టీడీపీ మండల అధ్యక్షుడు అమలకంటి అబద్ధం మాట్లాడుతూ ఇక్కడ స్టీల్‌ప్లాంట్ పెట్టడం వలన నిరుద్యోగ సమస్య ఉండదన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నక్కపల్లి మండల అధ్యక్షుడు గింజాల లక్ష్మణరావు, టీడీపీ నేతలు ఎన్ వెంకటరాజు, గుర్రం రామకృష్ణ, అల్లు నరసింహమూర్తి, వంగలపూడి గోవింద్, కోన అప్పలరాజు పాల్గొన్నారు.

స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ పూర్తి చేయాలి

పాయకరావుపేట, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): మండలంలో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని త్వరితగతిన పూర్తిచేయాలని తహశీల్దారు ఎస్ఏ.మహేష్ డీలర్లను ఆదేశించారు. గురువారం స్థానిక స్త్రీశక్తి భవనంలో రేషన్ డీలర్లతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మండలంలో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీని వంద శాతం పూర్తిచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సీఎస్‌డీటీ గణపతిరావు, రేషన్ డీలర్లు పాల్గొన్నారు.

ఓజీ విడుదల సందర్భంగా జనసైనికుల సంబరాలు

ఎస్.రాయవరం, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కొణిదల పవన్‌కల్యాణ్ హీరోగా నటించిన ఓజీ సినిమా గురువారం విడుదల అయిన సందర్భంగా జనసైనికులు, పవన్‌కల్యాణ్ అభిమానులు పండుగ చేసుకుంటున్నారు. ఈ సందర్భంగా ధర్మవరం అగ్రహారం సినిమా థియేటర్ వద్ద జనసేన మండల యూత్ ప్రెసిడెంట్ లింగంపల్లి జ్యోతికుమార్ ఆధ్వర్యంలో బాణసంచా కాల్చారు. కార్యక్రమంలో జనసేన నాయకులు తేటకాల అరవింద్, వీసం సాయి, మాలెం రాజు, గొర్లి సతీష్, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

సాకారం కానున్న ఆదివాసీల కల

... 3వ పేజీ తరువాయి

ప్రత్యేకంగా ఎటువంటి సంక్షేమ ఫలాలు అందడంలేదు. తమ గ్రామాలను ఐదో షెడ్యూల్డు ప్రాంతంలో విలీనం చేయాలని ఎన్నో ఏళ్లుగా ఆందోళనలు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి ప్రస్తుతం జరుగుతున్న శాసనసభ సమావేశాల్లో.. అనకాపల్లి జిల్లాతోపాటు రాష్ట్రంలోని పలు జిల్లాల్లో 600 గిరిజన గ్రామాలు నాన్‌షెడ్యూల్డు ఏరియాలో ఉన్నాయని, దీంతో ఈ గ్రామాలు అభివృద్ధికి నోచుకోవడం లేదని చెప్పారు. ఈ గ్రామాలను ఐదో షెడ్యూల్డు ఏరియాలో చేరుస్తారా? అన్న ప్రశ్నకు మంత్రి సంధ్యారాణి స్పందించారు. రాష్ట్రంలో 496 గిరిజన గ్రామాలను షెడ్యూల్డ్ ప్రాంతంలోకి తెచ్చేందుకు ప్రతిపాదనలు వచ్చాయని, 50 శాతం కంటే ఎక్కువ గిరిజన జనాభా వున్న గ్రామాల వివరాలు తీసుకోవాలని ఐటీడీఏ పీవోలు, కలెక్టర్లకు సూచించామని చెప్పారు. దీంతో మైదానప్రాంత గిరిజనుల్లో ఆశలు చిగురిస్తున్నాయి.

అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్రానికి పంపాలి

డి.వెంకన్న, సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు

అల్లూరి సీతారామరాజు జిల్లాను ఆనుకొని అనకాపల్లి జిల్లాలోని ఎనిమిది మండలాల్లో వున్న గిరిజన గ్రామాల్లో సర్వే నిర్వహించాలి. గ్రామ సభలు నిర్వహించి గిరిజన జనాభా ఎంత శాతం వున్నారో గుర్తించాలి. వాస్తవానికి 200 పైచిలుకు గ్రామాల్లో గిరిజనులు సగానికిపైబడి వున్నారు. కానీ గత వైసీపీ ప్రభుత్వం ఈ సంఖ్యను 114కు తగ్గించింది. పైగా ఈ గ్రామాలను సైతం ఐదో షెడ్యూల్‌లో చేర్చలేదు. ఇందుకు రియల్ ఎస్టేట్, మైనింగ్ వ్యాపారుల ఒత్తిళ్లే కారణం. గిరిజన గ్రామాల్లో వేలాది ఎకరాలను వీరు అక్రమంగా కొనుగోలు చేశారు. ఈ గ్రామాలు ఏజెన్సీలో విలీనం అయితే తాము భూములను కోల్పోవాల్సి వస్తుందన్న ఉద్దేశంతో అడ్డుకుంటున్నారు. గిరిజన గ్రామాలను ఏజెన్సీలో విలీనం చేయడానికి కూటమి ప్రభుత్వం వెంటనే అసెంబ్లీలో తీర్మానం చేసి, పార్లమెంటు ఆమోదం కోసం కేంద్రానికి పంపాలి.

ఆక్రమణలో పంచాయతీ స్థలాలు

... 3వ పేజీ తరువాయి

నిర్మించుకున్నారు. స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్‌ను ఆనుకుని గతంలో వేసిన లేఅవుట్‌లో పంచాయతీకి దఖలుపడిన సుమారు 200 గజాల స్థలాన్ని ఒక వ్యక్తి ఆక్రమించడంతోపాటు రేకులతో పక్కా నిర్మాణం చేపట్టి నివాసం వుంటున్నారు. రాజుగారిబీడులోని సందప్ప చెరువు పుంతరోడ్డును ఆనుకుని గతంలో వేసిన లేఅవుట్‌లో పంచాయతీకి దఖలుపడిన స్థలంలో ఒక కుటుంబం పాక నిర్మించుకుని వుంటున్నది. దీనిపై 'ఆంధ్రజ్యోతి'లో వార్త ప్రచురితం కావడంతో పంచాయతీ అధికారులు బోర్డు ఏర్పాటు చేశారు తప్ప పాక తొలగించలేదు. సాయిఆదర్శనగర్‌లో వేసిన లేఅవుట్‌లో నేరెళ్ల కాలువను ఆనుకుని పంచాయతీకి కేటాయించిన స్థలాన్ని ఆక్రమించి, పక్కా నిర్మాణం జరిగిన వైనంపై 'ఆంధ్రజ్యోతి'లో కథనం రావడంతో అప్పటి పంచాయతీ ఈఓ స్పందించి, స్థలాన్ని స్వాధీనం చేసుకుంటామని ప్రకటించారు. కానీ ఆ స్థలంలో పక్కా ఇంటి నిర్మాణం జరగ్గా, దీనికి పంచాయతీ అధికారులు ఇంటి పన్ను కూడా వేశారు. పంచాయతీరాజ్ శాఖ అతిథిగృహం ఎదుట సర్వే నంబర్ 132/3బిలో 1985లో వేసిన లేఅవుట్‌లో ప్రజోపయోగం కోసం కేటాయించిన 408 గజాల స్థలంలో సగం కబ్జాకు గురైంది. మిగిలిన స్థలంలో ఓ వ్యక్తి సిమెంట్ తూరలు తయారు చేసుకుంటూ పంచాయతీకి నామమాత్రంగా అద్దె చెల్లిస్తున్నారు. చిత్రమందిర్ థియేటర్ ఎదుటి వీధిలో పంచాయతీకి చెందిన సుమారు పది సెంట్ల స్థలంలో పాత ఇనుము కొట్టు వ్యాపారం సాగిస్తున్న వ్యక్తి పంచాయతీకి ఒక్క రూపాయి కూడా చెల్లించడం లేదు. దీనిపై పంచాయతీ ఇన్‌చార్జి కార్యదర్శి కె.డేవిడ్‌ని వివరణ కోరగా.. లేఅవుట్లలో వున్న పంచాయతీ స్థలాలను గుర్తించి బోర్డులు ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. పంచాయతీ స్థలాల్లో నిర్మాణాల విషయాన్ని వీఎంఆర్డీఏ అధికారుల దృష్టికి తీసుకెళతామని, తదుపరి చర్యలు వారే తీసుకుంటారని ఆయన తెలిపారు.

తాచేరు గెడ్డలో పడి రైతు మృతి

... 3వ పేజీ తరువాయి

సుబ్బారావు మృతదేహం కనిపించింది. నీటిలో నుంచి ఒడ్డుకు చేర్చి పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఎస్ఐ శ్రీనివాసరావు వచ్చి పరిశీలించారు. మృతదేహానికి పోస్టుమార్టం చేయించి కుటుంబ సభ్యులకు అప్పగించారు. కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ తెలిపారు. కాగా ఇదే కాజ్‌వే వద్ద మంగళవారం ఉదయం ఎనిమిదో తరగతి విద్యార్థి నీటిలో పడి గల్లంతై మృతిచెందాడు.

ఏయూలో ఉద్రిక్తత

... 3వ పేజీ తరువాయి

చెప్పామని, ఆయన పట్టించుకోకపోవడం వల్లే ఇప్పుడు మణికంఠ మరణించాడని ఆరోపించారు. తక్షణమే ఆయన పదవికి రాజీనామా చేయాలని, మణికంఠ కుటుంబానికి కోటి రూపాయల పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. దీంతో వీసీ రాజశేఖర్ అక్కడికి వచ్చి, తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చి వెళ్లిపోయారు. అయితే విద్యార్థి నాయకులు సంతృప్తి చెందలేదు. డిస్పెన్సరీలో వైద్యం అందకపోవడానికి బాధ్యులైన వారిని సస్పెండ్ చేయాలంటూ సుమారు 50 మంది విద్యార్థులు వీసీ ఛాంబర్‌లోకి దూసుకువెళ్లారు. వారిని ప్రొఫెసర్లు, పోలీసులు అడ్డుకొని వీసీకి రక్షణ కల్పించారు.

కాగా మణికంఠ మృతదేహానికి పోస్టుమార్టం చేయకుండా తమకు ఇవ్వాలని తండ్రి శ్రీనివాసరావు కేజీహెచ్ వైద్యులను కోరారు. వీసీ వచ్చి చెబితే తప్ప తాము ఏమీ చేయలేమని వైద్యులు చెప్పడంతో వారు యూనివర్సిటీకి వచ్చి వీసీని కలిశారు. పోలీసుల సాయంతో వీసీ కేజీహెచ్‌కు వెళ్లి చర్చలు జరిపారు. మణికంఠ మృతిపై ఎటువంటి అనుమానాలు లేవని, దానికి ఎవరూ బాధ్యులు కారని రాతపూర్వకంగా ఇస్తే పోస్టుమార్టం లేకుండా మృతదేహాన్ని ఇస్తామని వైద్యులు చెప్పడంతో తండ్రి శ్రీనివాసరావు అక్కడికక్కడే ఆ విధంగా లేఖ రాసి కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ వాణికి ఇచ్చారు. మృతదేహాన్ని ఇవ్వడానికి వైద్యులు రాత్రి ఏడు గంటలకు అంగీకరించారు.

కొవ్వొత్తులతో నివాళి

వీసీ రాజశేఖర్ పోలీసుల సాయంతో కేజీహెచ్‌కు వెళ్లిన తరువాత కూడా విద్యార్థులు ఏయూలో ఆందోళన కొనసాగించారు. రాత్రి ఏడు గంటలకు కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఏయూ ప్రొఫెసర్లు వారితో చర్చించారు. డిస్పెన్సరీలో తక్షణమే వసతులు కల్పిస్తామని, బాధ్యులపై చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అయితే వీసీ రాజీనామా చేయాల్సిందేనని విద్యార్థులు పట్టుబట్టారు. దీనిపై ఆరోగ్య శాఖ మంత్రికి, డిప్యూటీ సీఎంకు, గవర్నర్‌కు ఫిర్యాదు చేస్తామన్నారు. రాత్రి 7.30 గంటకు ఆందోళన విరమించి, శుక్రవారం యూనివర్సిటీ బంద్‌కు పిలుపునిచ్చారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తత అవసరం

అనకాపల్లి టౌన్, సెప్టెంబరు 25 (ఆంధ్ర జ్యోతి): సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎన్టీఆర్ వైద్యాలయం అభివృద్ధి కమిటీ సభ్యుడు డాక్టర్ డీడీ నాయుడు సూచించారు. గురువారం వైద్యాలయాన్ని సందర్శించి రోగులతో మాట్లాడారు. దోమలు కుట్టకుండా జాగ్రత్తలు తీసుకుంటే జ్వరాలు రావన్నారు. ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ లేకుండా చూసుకోవాలన్నారు. కొబ్బరి చిప్పలు, పాత టైర్లు, పాత డబ్బాలు వంటివి ఇంట్లో ఉంటే తొలగించాలని సూచించారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు పంపిణీ

కొత్తూరు, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): అనకాపల్లి మండలంలోని పిసినికాడ గ్రామంలో అనారోగ్యానికి గురైన కనిశెట్టి నరేశ్‌కు రూ.96 వేల చెక్కును జనసేన, టీడీపీ నాయకులు చదరం నాగేశ్వరరావు, కర్రి బాబి, బంటు రవి, గంగుపాం జగదీశ్ గురువారం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ సిఫారసు మేరకు సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ సహాయ సహకారంతో ఈ చెక్కును మంజూరైందని చెప్పారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు శ్రీను, మళ్ల సాయి, ఆడారి సతీష్, దాడి బాల, శ్రీను, పైడిరాజు, వంశీ, రామారావు తదితరులు పాల్గొన్నారు.

లే ఆఫ్ ఎత్తివేయాలని ధర్నా

కశింకోట, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): తేగాడ గ్రామంలోని క్రెబ్స్ కంపెనీలో లే ఆఫ్ ఎత్తివేయాలని కార్మికులు గురువారం ధర్నా చేశారు. ఈ సందర్భంగా యూనియన్ ప్రతినిధులు ఏవీ.అప్పారావు, బాబూరావు, శ్రీనివాసరావు, అప్పారావు, కన్నబాబు మాట్లాడుతూ ఐదు నెలలు గడుస్తున్నా క్రెబ్స్ కంపెనీ తెరవకపోవడంతో 350 కుటుంబాలు రోడ్డున పడ్డాయని వాపోయారు. రాష్ట్ర ప్రభుత్వం కొత్త కంపెనీలు, లక్షల ఉద్యోగాలు వస్తాయని ప్రచారం చేస్తున్నదని, ఉన్న కంపెనీని తెరి పించాని కోరారు. ఎంపీ సీఎం రమేశ్, ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ జోక్యం చేసుకొని కంపెనీ తెరిపించేందుకు చర్యలు తీసుకోవాలని విన్నవించారు.

రైల్వే స్టేషన్‌లో శ్రమదానం

అనకాపల్లి టౌన్, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): స్థానిక రైల్వే స్టేషన్‌లో గురువారం స్వచ్ఛత హి సేవా కార్యక్రమాన్ని నిర్వహించారు. స్టేషన్ మేనేజర్ సచ్చినివాస్ ఆధ్వర్యంలో సిబ్బంది, ఆర్‌పీఎఫ్ అధికారులు స్టేషన్ ఆవరణలోని పిచ్చి మొక్కలను తొలగించారు. అలాగే ప్లాట్‌ఫారాలను పరిశుభ్రం చేశారు. లక్ష్మీదేవిపేట రైల్వే వంతెన కింద భాగంలో పేరుకుపోయిన తుప్పలను తొలగించారు. అలాగే ఎన్టీఆర్ మార్కెట్ యార్డులోని గ్రామీణ బ్యాంకు ఆధ్వర్యంలో సిబ్బందితో పారిశుధ్య కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రాంతీయ మేనేజర్ సతీశ్‌చంద్ర మాట్లాడుతూ సమాజంలో పరిశుభ్రత అత్యంత కీలకమన్నారు. ఆరోగ్యమైన వాతావరణానికి అందరూ శుభ్రతను అలవాటు చేసుకోవాలని ఆయన సూచించారు.

రైతులకు పరిహారం చెల్లించాలి

అనకాపల్లి రూరల్, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): రాజుపాలెం రైల్వే ఫ్లై ఓవర్ వంతెన పనుల్లో భూములు కోల్పోయిన రైతులకు నాలుగు రెట్లు పరిహారం చెల్లించాలని సీపీఎం మండల కన్వీనర్ శ్రీరామ్ డిమాండ్ చేశారు. కొత్తూరు నరసింగరావుపేటలోని రాజుపాలెం ఫ్లై ఓవర్ వంతెన నిర్మాణ పనులు జరగనున్న సమీపంలో రైతులతో కలిసి గురువారం ధర్నా చేశారు. రాజుపాలెం సర్వే నంబరు 61,62లో వంతెన నిర్మాణానికి భూములు సేకరిస్తున్నారని, వాటికి మార్కెట్ ధర కంటే తక్కువ ఇస్తామనడం దుర్మార్గమని చెప్పారు. రైతులకు న్యాయం చేసిన తర్వాతే వంతెన పనులు కొనసాగించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కశిరెడ్డి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యకర జీవనం

▸▸ జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్


పిసినికాడ శ్మశానవాటికలో చీపురు పట్టి తుడుస్తున్న కలెక్టర్ విజయకృష్ణన్

కొత్తూరు, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): పరిసరాలు పరిశుభ్రంగా ఉన్నప్పుడే ఆరోగ్యవంతమైన జీవనం సాధ్యమని జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్ స్పష్టం చేశారు. అనకాపల్లి మండలం పిసినికాడ శ్మశానవాటికలో గురువారం నిర్వహించిన స్వచ్ఛత హి సేవ కార్యక్రమంలో ఆమె పాల్గొని శ్రమదానం చేశారు. పరిసరాలు, కాలువలను చీపురు పట్టి శుభ్రం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చెత్తను ఎక్కడపడితే అక్కడ పడవేయకూడదని చెప్పారు. తడి చెత్త, పొడి చెత్తగా విడదీసి పారిశుధ్య సిబ్బందికి అందజేయాలని సూచించారు. అలాగే చెత్తను సంపద సృష్టి కేంద్రాలకు తరలించి సంపద సృష్టించవచ్చని, ఘన వ్యర్థాల నుంచి ఖనిజాలు, రీసైకిలింగ్ మెటీరియల్ పొందవచ్చని ఆమె తెలిపారు. తడి చెత్త నుంచి వర్మి కంపోస్టు తయారు చేసి పంటలకు వినియోగించుకోవచ్చన్నారు. గ్రామంలో వెంటనే ట్రాక్టర్ తొట్టు కొనుగోలు చేసి డంపింగ్ యార్డు వద్ద చెత్త నిల్వ లేకుండా తరలించాలని కలెక్టర్ ఆదేశించారు. అలాగే స్వచ్ఛత కార్యక్రమంలో స్వచ్ఛంద సంస్థలు, యువత, ప్రజలు భాగస్వాములు కావాలని కలెక్టర్ విజ్ఞప్తి చేశారు. అనంతరం పారిశుధ్య కార్మికులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో షేక్ ఆయిషా, ఎంపీడీవో ఆశాజ్యోతి, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

వైభవంగా శరన్నవరాత్రి వేడుకలు

నూకాంబిక ఆలయంలో సహస్ర కమలార్చన


కొల్లూరు మూకాంబికదేవిగా కనకదుర్గమ్మ... అన్నపూర్ణదేవి అలంకరణలో కన్యకాపరమేశ్వరి.... పూజలు చేస్తున్న మహిళలు

అనకాపల్లి టౌన్, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పలు ఆలయాలు, మండపాల్లో కనకదుర్గమ్మ శరన్నవరాత్రి ఉత్సవాలు గురువారం వైభవంగా జరిగాయి. నూకాంబిక ఆలయంలోని బాలాలయంలో అమ్మవారికి తోమాలసేవ, సహస్ర కమలార్చన నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు ఉత్సవమూర్తిని దర్శించుకున్నారు. విరాళ దాతలు రొంగలి శ్రీనివాసరావు, పద్మావతి, జగన్నాథరావు, పూర్ణిమా, నవీన్‌కుమార్, రూపా దంపతులు అన్న సమారాధనను ప్రారంభించారు. కార్యక్రమంలో ఆలయ సహాయ కమిషనర్ కేఎల్ సుధారాణి, మాజీ చైర్మన్ పీలా నాగశ్రీను పాల్గొన్నారు. అలాగే గవరపాలెం సతకంపట్టులోని అమ్మవారు కొల్లూరు మూకాంబికదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ ప్రధాన అర్చకులు భోగాపురపు వెంకటరమణ ఆధ్వర్యంలో నిత్యపూజలు, అభిషేకాలు జరిగాయి. మాలధారణ భక్తులకు అన్నసమారాధన కార్యక్రమం చేపట్టారు. అమ్మవారిని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి దాడి రత్నాకర్ కుటుంబ సభ్యులు దర్శించుకున్నారు. ఆలయ నిర్వాహకులు వీరిని సత్కరించి అమ్మవారి ప్రసాదాన్ని అందజేశారు. ఆలయ శాశ్వత చైర్మన్ కాండ్రేగుల నాయుడు, వ్యవస్థాపకులు వీవీ రమణ, ఉత్సవ కమిటీ చైర్మన్ భీమరశెట్టి వరహా నూకరాజు అమ్మవారికి పూజలు చేశారు. నిదానందొడ్డిలోని కామాక్షిదేవి ఆలయంలో అమ్మవారు రాజరాజేశ్వరిదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. తిమ్మాపాత్రుని చక్రవర్తి ఆధ్వర్యంలో నిర్వహించిన కోలాటాలు, అన్నమాచార్య కీర్తనలు భక్తులను ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో సంఘ ప్రతినిధులు పెదబాబు, బ్రహ్మాజీ, శ్రీనివాసరావు పాల్గొన్నారు. పార్కు జంక్షన్‌లో నవ యువతరం స్వచ్ఛంద సంస్థ, పార్కు సెంటర్ యూత్ ఆధ్వర్యంలో శరన్నవరాత్రి వేడుకలు ఘనంగా జరుగుతున్నాయి. అమ్మవారి మండపం వద్ద కాత్యాయిని అలంకరణలో అమ్మవారిని అలంకరించారు. మహిళలతో వ్రతాలు, కుంకుమ పూజలు నిర్వహించారు. కన్యకాపరమేశ్వరి ఆలయంలో అమ్మవారు అన్నపూర్ణ దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కోరుకొండ బుచ్చిరాజు, డాక్టర్ గ్రంధి శేషకుమార్, బి.కృష్ణకుమార్, కె.జగదీశ్వరరావు, ఎస్.సోమరాజు, వి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

గౌరీ పంచాయతన ఆలయంలో...

గౌరీ పంచాయతన ఆలయంలో గురువారం అమ్మవారు గజలక్ష్మిదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా ఆలయ మండపంలో 108 రూపాయల నాణేలతో సామూహిక మహిళల సహస్రనామ పూజ ఘనంగా జరిగింది. కార్యక్రమంలో అర్చకులు ఎ.గోపాలకృష్ణశర్మ, రాంప్రసాద్ శర్మ, కె.శ్రీకర్‌శర్మ, ఆలయ అధ్యక్షులు కర్రి సన్యాసినాయుడు, కార్యదర్శి బొడ్డేడ రామ సత్యనారాయణ, కోశాధికారి శరగడం జగదీశ్, పాలకవర్గ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

అలరించిన నాటకోత్సవాలు


నాటికలోని ఓ సన్నివేశం

అనకాపల్లి టౌన్, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): గవరపాలెం సతకంపట్టు కనకదుర్గమ్మ శరన్నవరాత్రి వేడుకల్లో భాగంగా గురువారం రాత్రి గౌరీ సంఘంలోని కర్రి రమేశ్ వేదికలో ఉభయ తెలుగు రాష్ట్రాల నాటకోత్సవాలను గౌరీ సంఘం అధినేత బుద్ధ శివాజీ, లీడర్ కరస్పాండెంట్ వీవీ రమణ ప్రారంభించారు. ఉత్సవ కమిటీ చైర్మన్ భీమరశెట్టి వరహా నూకరాజు, ఆలయ వ్యవస్థాపకులు వీవీ రమణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన గోవాడ క్రియేషన్స్ హైదరాబాద్ వారి అమ్మ చెక్కిన బొమ్మ, సద్గురు కళా నిలయం గుంటూరు వారి నాన్న నాటికలు శ్రోతలను ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో గవర కార్పొరేషన్ చైర్మన్ మళ్ల సురేంద్ర, టీడీపీ పట్టణ అధ్యక్షుడు డాక్టర్ కేకేవీఏ నారాయణరావు, నాయకులు బీశెట్టి బాబ్జి, కొణతాల మురళీకృష్ణ పాల్గొన్నారు.

తాళ్లపాలెంలో దుర్గమ్మ ఘటాల ఊరేగింపు

కశింకోట, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మేజర్ పంచాయతీ తాళ్లపాలెం దుర్గాలమ్మపేటలో దుర్గాదేవి శరన్నవరాత్రి మహోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఇందులో భాగంగా గురువారం దుర్గమ్మ ఘటాల ఊరేగింపు కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అధిక సంఖ్యలో భవానీ భక్తులు పాల్గొని భక్తిభావాన్ని చాటుకున్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

కొత్త టీచర్లలో సంబరం

మెగా డీఎస్సీలో 1269 మంది ఎంపిక.. విజయవాడలో నియామకపత్రాలు

హాజరుకాలేకపోయిన 25 మంది బాలింతలు, గర్భిణులు


నియామకపత్రాలతో నూతన ఉపాధ్యాయినులు

విశాఖపట్నం, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): మెగా డీఎస్సీ ద్వారా ఎస్జీటీ నుంచి ప్రిన్సిపాల్ వరకు పలు కేడర్లలో ఉమ్మడి విశాఖ జిల్లాకు చెందిన మొత్తం 1,269 మంది ఎంపికయ్యారు. వీరిలో గురువారం సాయంత్రం విజయవాడలో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో 1,244 మంది నియామకపత్రాలు అందుకున్నారు. ముందస్తు అనుమతితో హాజరుకాలేని 25 మందిలో బాలింతలు, గర్భిణులున్నారు. వీరికి త్వరలో విశాఖపట్నంలో నియామకపత్రాలను అందజేస్తారు. ఈ కార్యక్రమానికి హాజరయ్యేందుకు బుధవారం జిల్లా నుంచి సుమారు 70 బస్సుల్లో కొత్త ఉపాధ్యాయులు విజయవాడకు బయలుదేరి వెళ్లారు. వీరిలో ఉమ్మడి జిల్లా అరకు ప్రాంతానికి చెందిన ఒకరిద్దరికి ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు నియామకపత్రాలు అందజేశారు. మిగిలిన వారికి ప్రాంగణంలో ఏర్పాటుచేసిన కౌంటర్లలో అందజేశారు. ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి విజయవాడ వెళ్లే వారికి నాయకత్వం వహించిన పాఠశాల విద్యాశాఖ ఆర్జేడీ విజయభాస్కర్, ఆ శాఖ డీఈవో ఎన్.ప్రేమ్‌కుమార్, ఇతర అధికారులు, సిబ్బందిని పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ విజయరామరాజు అభినందించారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక డ్రైవ్‌లు: ఎస్పీ తుహిన్‌సిన్హా

అనకాపల్లి రూరల్, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక డ్రైవ్‌లు నిర్వహించాలని అన్ని పోలీస్‌స్టేషన్ల అధికారులను జిల్లా ఎస్పీ తుహిన్‌సిన్హా ఆదేశించారు. ఈ మేరకు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ నెల 29వ తేదీ నుంచి వచ్చే నెల 26వ తేదీ వరకు జిల్లాలోని అన్ని పోలీస్‌స్టేషన్ల ఎస్‌హెచ్‌వోలు ఈ డ్రైవ్‌లు నిర్వహించాలన్నారు. ప్రధానంగా నేషనల్ స్టేట్ హైవేలపై రాంగ్‌రూట్‌లో ప్రయాణిస్తున్న వాహనదారులపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. రాంగ్ పార్కింగ్, నో పార్కింగ్ వద్ద వాహనాల నిలిపివేత, హెల్మెట్ ధరించని వాహనదారులకు జరిమానాలు విధించాలన్నారు. మద్యం సేవించి వాహనాలు నడిపే వారు, మొబైల్ ఫోన్ వాడుతూ డ్రైవింగ్ చేసే వారిపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

క్రీడా పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

సబ్బవరం, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): స్థానిక రేంజర్స్ డిఫెన్స్ అకాడమీ విద్యార్థులు అనకాపల్లి ఏఎంఏఎల్ కళాశాల, విశాఖపట్నం బుల్లయ్య కళాశాలల్లో ఇటీవల జరిగిన స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అండర్-19 జిల్లా స్థాయి పోటీల్లో ప్రతిభ చూపారని ప్రిన్సిపాల్ పోతల సత్యనారాయణ తెలిపారు. ఈ మేరకు రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారన్నారు. వివిధ అంశాల్లో ప్రతిభ కనబరిచిన బొబ్బిలి పవన్ కుమార్, సిహెచ్.పూర్ణచంద్, బి.పరమేశ్, ఆర్.ధనరాజ్, పి.అజయ్, బి.భరత్‌చంద్ర, కె.రమణ, తేజ స్వరూప్‌లను ప్రిన్సిపాల్ అభినందించారు.

పౌష్టికాహారంతోనే ఆరోగ్యం

కశింకోట, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): మహిళలు ఆరోగ్యంగా ఉండాలంటే క్రమం తప్పకుండా పౌష్టికాహారం తీసుకోవాలని ఏఎంసీ వైస్ చైర్మన్ కర్రి సత్యనారాయణ స్పష్టం చేశారు. కన్నూరుపాలెంలో గురువారం ఏర్పాటు చేసిన వైద్య శిబిరంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కుటుంబ సభ్యులంతా ఆరోగ్యంగా ఉండాలంటే మహిళ ఆరోగ్యంగా ఉండాలని చెప్పారు. ప్రత్యేక వైద్య శిబిరాలను మహిళలు వినియోగించుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో సీహెచ్‌సీ వైద్యాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

'పని గంటల పెంపు దారుణం'

పరవాడ, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): పని గంటల పెంపు దారుణమని సీఐటీయూ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గనిశెట్టి సత్యనారాయణ మండిపడ్డారు. తక్షణమే ఈ విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ కార్మికులతో గురువారం నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికుల సంక్షేమమే ధ్యేయమని అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం, నేడు కార్మికుల శ్రమను దోచుకునేందుకు చట్టాలను మార్చడం సిగ్గుచేటన్నారు. కార్మికుల హక్కులను యాజమాన్యాలకు తాకట్టు పెట్టాలనే ప్రయత్నాలను తక్షణమే ఉప సంహరించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు డి.దేముడు, కె.వెంకునాయుడు, పి.అప్పారావు, ముత్యాలు, రామునాయుడు, సత్తిబాబు, రాజు తదితరులు పాల్గొన్నారు.

తుమ్మపాలలో ప్రత్యేక వైద్య శిబిరం

తుమ్మపాల, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తుమ్మపాలలో గురువారం ప్రత్యేక వైద్య శిబిరాన్ని నిర్వహించారు. వైద్యులు సుధాకర్‌రావు, వాణి జగదీశ్వరి రోగులకు వైద్య పరీక్షలు చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ జగదీశ్వరి మాట్లాడుతూ మహిళలు, పిల్లల ఆరోగ్య సంరక్షణపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని చెప్పారు. ఇందులో భాగంగా రక్త, క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలుచసి, అవసరమైన వారికి మందులను అందిస్తున్నదన్నారు. బీపీ, షుగర్ ఉన్నవారికి తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు కర్రి బాబి, ఎంపీటీసీ సభ్యుడు నాగేశ్వరరావు, నాయకులు ఆడారి గోవిందరావు, పి.బలరాం, సిబ్బంది శారదా, మంగమ్మ, మరియమ్మ, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

పరవాడలో...

పరవాడ, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నాయుడుపాలెంలో గురువారం వైద్య శిబిరం నిర్వహించారు. వైద్యులు కనకఅప్పారావు, ఫాతిమా బేగం 109 మంది మహిళలకు, 28 మంది పురుషులకు వైద్య పరీక్షలు చేశారు. అంతకు ముందు స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి వైద్యులు ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ కె.వరలక్ష్మి, ఎంపీటీసీ మాజీ సభ్యుడు కె.శ్రీరామ్మూర్తి, వైద్య సిబ్బంది కె.శ్రీనివాసరావు, వి.సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

పైడివాడలో సీసీ రోడ్డు నిర్మాణం

సబ్బవరం, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పైడివాడ గ్రామంలో రూ.7.5 లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణ పనులను ఎంపీటీసీ సభ్యుడు శీరం అప్పలరాజు గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నక్క వాసు ఇంటి నుంచి రామరాజు ఇంటి వరకూ ఈ రోడ్డు నిర్మిస్తున్నట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు దాసరి రాము, ప్రసాద్, సేనాపతి రాము, మోపాడ పవన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రయాణికులకు మెరుగైన సదుపాయాలు

డీపీటీవో ప్రవీణ


ఆర్టీసీ అధికారులతో మాట్లాడుతున్న డీపీటీవో

అనకాపల్లి టౌన్, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): ప్రయాణికులకు మౌలిక సదుపాయాల కల్పనకు చర్యలు తీసుకోవాలని ఆర్టీసీ డీపీటీవో వి.ప్రవీణ సూచించారు. తన కార్యాలయంలో గురువారం రెండు డిపోల డీఎంలు, అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. బస్ స్టేషన్లలో పరిసరాల పరిశుభ్రతకు, ఎప్పటికప్పుడు ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు చర్యలు తీసుకోవాలని చెప్పారు. స్త్రీశక్తి పథకం అమలుపై సమీక్ష నిర్వహించారు. దసరా స్పెషల్స్‌కు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సూచించారు. అలాగే భవానీ భక్తులకు ప్యాకేజీలు వివరించి ఆర్టీసీ ఆదాయానికి కృషి చేయాలన్నారు. బస్సులన్నీ ఎప్పటికప్పుడు పరిశీలించి కండిషన్‌లో ఉండేలా చూసుకోవాలని చెప్పారు.

వాడపల్లికి ప్రత్యేక సర్వీస్...

వాడపల్లి వేంకటేశ్వరస్వామి దేవస్థానానికి వెళ్లే ప్రయాణికులకు ఈ నెల 27 నుంచి అల్ట్రా డీలక్స్ బస్సును అందుబాటులోకి తీసుకువస్తున్నట్టు ఆర్టీసీ అధికారులు తెలిపారు. ఇప్పటివరకు ఎక్స్‌ప్రెస్ సర్వీసు అందుబాటులో ఉందని, దాని స్థానంలో అల్ట్రా డీలక్స్‌గా అప్‌గ్రేడ్ చేశామని సూచించారు.

భవానీ మాలధారుల కోసం ఆర్టీసీ ప్రత్యేక బస్సులు


నర్సీపట్నంలో ఏర్పాటు చేసిన ఆర్టీసీ రిజర్వేషన్ కౌంటర్

నర్సీపట్నం, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): విజయవాడ వెళ్లే భవానీ మాలధారుల కోసం ఆర్టీసీ ప్రత్యేక బస్సు సర్వీసులను సమకూరుస్తుందని నర్సీపట్నం డిపో మేనేజర్ ఎంఎస్ఎస్ ధీరజ్ తెలిపారు. ఇందుకోసం బస్టాండ్‌లో ప్రత్యేక రిజర్వేషన్ కౌంటర్ ఏర్పాటు చేశామని అన్నారు. కనీసం 50 మంది ఉంటే వుంటేనే ఆయా గ్రామాల నుంచి విజయవాడకు ప్రత్యేక బస్సు ఏర్పాటు చేస్తామని తెలిపారు. నర్సీపట్నం నుంచి నేరుగా విజయవాడ వెళ్లి రావడానికి ఒక్కో మనిషికి పల్లె వెలుగు రూ.800, అల్ట్రా పల్లె వెలుగు రూ.900, ఎక్స్‌ప్రెస్ బస్సు రూ.1000, అల్ట్రా డీలక్స్ బస్సుకి రూ.1,250 చొప్పున టికెట్ చార్జీలు ఉంటాయని వెల్లడించారు. నర్సీపట్నం నుంచి ద్వారకాతిరుమల మీదుగా విజయవాడ వెళ్లిరావడానికి పల్లె వెలుగు బస్సు రూ.860, అల్ట్రా పల్లె వెలుగు రూ.970, ఎక్స్‌ప్రెస్ బస్సు రూ.1,070, అల్ట్రా డీలక్స్ బస్సు రూ.1,350 చార్జీలుగా నిర్ణయించినట్టు పేర్కొన్నారు. అలాగే నర్సీపట్నం నుంచి విజయవాడ వెళ్లి, తిరిగి వచ్చేటప్పుడు, ద్వారకాతిరుమల ద్వారపూడి మీదుగా రావడానికి పల్లె వెలుగు రూ.910, అల్ట్రా పల్లె వెలుగు రూ.1,030, ఎక్స్‌ప్రెస్ బస్సు రూ.1,140, అల్ట్రా డీలక్స్ బస్సు రూ.1,420 చొప్పున చార్జీలు నిర్ణయించామని తెలిపారు.

అలాగే నర్సీపట్నం నుంచి గొల్లలమామిడాడ, ద్వారకాతిరుమల, ద్వారపూడి మీదుగా విజయవాడ వెళ్లడానికి పల్లెవెలుగు రూ.970, అల్ట్రా పల్లె వెలుగు రూ.1,090, ఎక్స్‌ప్రెస్ బస్సు రూ.1,210,, అల్ట్రా డీలక్స్ బస్సు రూ.1,510 టికెట్ చార్జీలు వుంటాయన్నారు. అలాగే నర్సీపట్నం నుంచి భద్రాచలం, పర్ణశాల, విజయవాడ, ద్వారపూడి తీర్థయాత్రకు పల్లెవెలుగు రూ.1,190, అల్ట్రా పల్లె వెలుగు రూ.1,340, ఎక్స్‌ప్రెస్ బస్సు రూ.1,490, అల్ట్రా డీలక్స్ బస్సు రూ.1,860 చొప్పున చార్జీలు ఉంటాయని తెలిపారు. ప్రత్యేక సర్వీసులు కావాల్సిన భక్తులు ముందుగా బుక్ చేసుకోవాలని, మరిన్ని వివరాల కోసం 9494811855, 7382916428, 9493211969 నంబర్లకు ఫోన్ చేసి సంప్రదించాలని కోరారు.

చోరీ కేసులో నిందితుడి అరెస్టు

▸▸ ఎనిమిది తులాల బంగారు ఆభరణాల స్వాధీనం


నిందితుడు, బంగార ఆభరణాలతో పోలీసులు

కశింకోట, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): బంగారం దొంగిలించిన కేసులో నిందితుడ్ని అరెస్టు చేసినట్టు సీఐ అల్లు స్వామినాయుడు తెలిపారు. గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ అచ్చెర్ల కూడలి వద్ద సాధారణ తనిఖీలు చేస్తుండగా కోటవురట్ల మండలం రామచంద్రపాలెం గ్రామానికి చెందిన కరక రాజుబాబు పోలీసులను చూసి అనుమానాస్పదంగా పారిపోతుండగా వెంబడించి అదుపులోకి తీసుకున్నా మని చెప్పారు. నిందితుడి బ్యాగు తనిఖీ చేయగా ఎనిమిది తులాల బంగారు ఆభరణాలు లభ్యమయ్యాయని చెప్పారు. మూడు తులాల బంగారు నల్లపూసల దండ, మూడు తులాల బంగారు గొలుసులు, రెండు, తులమున్నర రెండు జతల చెవి దిద్దులు, చెవి బుట్టలు, చైను, గోల్డు రింగు, విరిగిపోయిన రెండు జతల చెవిదిద్దులు స్వాధీనం చేసుకున్నామని ఆయన తెలిపారు. నిందితుడు 30 దొంగతనాలు చేసిన కేసులో 15 సార్లు జైలుకు వెళ్లి వచ్చినట్టు విచారణలో తేలిందన్నారు. ఈ ఏడాది జనవరి 1న కశింకోట అమిరపల్లి వీధిలో జరిగిన దొంగతనంలో 15 తులాల బంగారం అపహరించుకుపోయినట్టు నిందితుడు అంగీకరించాడన్నారు. దీంతో మధ్యవర్తుల సమక్షంలో అతని బ్యాగులో ఉన్న ఎనిమిది తులాలను రికవరీ చేయగలిగామని చెప్పారు. అలాగే తామరం పీఏసీఎస్‌లో దొంగతనానికి యత్నించిన కేసులో నిందితుడుగా ఉన్నాడన్నారు. ఈ మేరకు నిందితున్ని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామని సీఐ తెలిపారు.

అగ్రిసెట్‌లో ప్రతిభ

▸▸ అనకాపల్లి అగ్రి పాలిటెక్నిక్ విద్యార్థులకు ఉత్తమ ర్యాంకులు


ఎల్.స్వరూప (9వ ర్యాంకు) | వి.గౌరీశ్వరి (10వ ర్యాంకు) | పి.వెంకటేశ్ (19వ ర్యాంకు) | జి.అనూష (43వ ర్యాంకు)

అనకాపల్లి అగ్రికల్చర్, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): అగ్రిసెట్- 2025 ప్రవేశ పరీక్ష ఫలితాల్లో అనకాపల్లి ఆర్ఏఆర్ఎస్ వ్యవసాయ పాలిటెక్నిక్ విద్యార్థులు మంచి ఫలితాలు సాధించారు. 100 లోపు ర్యాంకులను పలువురు సాధించారు. వీరిని కళాశాల ప్రిన్సిపాల్, ఏడీఆర్ డాక్టర్ సీహెచ్ ముకుందరావు, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.చారుమతి అభినందించారు. ఎల్.స్వరూప తొమ్మిదవ ర్యాంకు, వి.గౌరీశ్వరి 10వ ర్యాంకు, పి.వెంకటేశ్ 19, వి.వర్షిణి 21, బి.సందీప్ కుమార్ 22, ఆర్.ఇందుమతి 33, జి.అనూష 43, టి.స్రవంతి 49, కె.సుస్మిత 61, వై.లీల కుమార్ 71, వై.శృతిలయ 83, కె.జ్యోతిక 90వ ర్యాంకు సాధించారు. అంతే కాకుండా 265లోపు ర్యాంకులను పలువురు సాధించారు.

బల్క్ డ్రగ్ పార్కును రద్దు చేయాలని నిరసన

అనకాపల్లి టౌన్, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): నక్కపల్లి మండలం రాజయ్యపేటలో ఏర్పాటుచేయనున్న బల్క్ డ్రగ్ పార్కును రద్దు చేయాలని గురువారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శివర్గసభ్యుడు ఆర్.శంకరరావు మాట్లాడుతూ అక్రమంగా అరెస్టు చేసిన సీపీఎం జిల్లా నేత కోటేశ్వరరావును బేషరతుగా విడుదల చేయాలని డిమాండ్ చేశారు. మత్స్యకారుల అభిప్రాయాలను గౌరవించి బల్క్ డ్రగ్ పార్కును రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు గంటా శ్రీరామ్, అల్లు రాజు, గండి నాయనబాబు, కె.తేలయ్యబాబు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతోనే ఆరోగ్య సమాజం

సబ్బవరం, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): పౌష్టికాహారంతోనే ఆరోగ్య సమాజం సాధ్యమని సీడీపీవో లలితకుమారి చెప్పారు. మండలంలోని అమరపినివానిపాలెం, జగన్నాథపురం, అప్పయ్యపాలెం గ్రామాల్లో గురువారం పోషణ్ పక్వాడా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గర్భిణులు, బాలిం తలు, కిశోర బాలికలకు, పిల్లలకు ఆరోగ్య పరీక్షలు చేశారు. అనంతరం పోషకాహారం, తల్లిపాలు ప్రాముఖ్యతపై సీడీపీవో అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సర్పంచ్ ఎం.అప్పారావు, ఎంపీటీసీ సభ్యురాలు లక్ష్మీ, సూపర్‌వైజర్ అప్పలనర్సమ్మ పాల్గొన్నారు.

ప్రభుత్వ కార్యాలయాల్లో తుప్పల తొలగింపు


మొక్కను నాటుతున్న ఎంపీడీవో రమణబాబు

గూడెంకొత్తవీధి, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ప్రభుత్వ కార్యాలయాల్లో సీఆర్‌పీఎఫ్ జవాన్లు, మండల పరిషత్ ఉద్యోగులు శ్రమదానంతో తుప్పలు తొలగించారు. గురువారం స్వచ్ఛత హీ సేవా కార్యక్రమంలో భాగంగా జవాన్లు, ఉద్యోగులు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, మండల పరిషత్ కార్యాలయం పరిసరాల్లో తుప్పలను తొలగించి శుభ్రపరిచారు. ఈ సందర్భంగా ఎంపీడీవో రమణబాబు, సీఆర్‌పీఎఫ్ జవాన్లు ప్రభుత్వ కార్యాలయాల్లో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి బాలకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థినుల శిక్షణపై జీసీడీవో సంతృప్తి


కేజీబీవీ విద్యార్థులతో జీసీడీఓ కవిత

డుంబ్రిగుడ, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కేజీబీవీ పాఠశాలను గురువారం జీసీడీఓ కవిత సందర్శించారు. ఈ సందర్భంగా పదో తరగతి విద్యార్థినులు బ్యూటీషియన్ కోర్సులో భాగంగా ఇస్తున్న ఇంటర్‌నెట్ షిప్ శిక్షణ తరగతులను ఆమె పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న కస్తూర్బా గాంధీ గురుకుల పాఠశాల విద్యార్థినులకు ఇంటర్ షిప్ తరగతులు ప్రారంభమయ్యాయని చెప్పారు. దసరా సెలవుల్లో నిర్వహిస్తున్న ఈ తరగతులను సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు. కార్యక్రమంలో లోకేషన్ ట్రైనర్ చంద్రిక, బ్యూటీషియన్ కీర్తి, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

మారుమూల గ్రామాలకు రోడ్లు వేసిన ఘనత 'కూటమి'దే

- విజయనగరం జోన్ ఆర్టీసీ చైర్మన్, సియ్యారి దొన్నుదొర
- రూ.9.55 కోట్లతో రోడ్డు పనులకు శంకుస్థాపన

అనంతగిరి, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): మారుమూల గిరిజన గ్రామాలకు రోడ్లు వేసిన ఘనత కూటమి ప్రభుత్వానికే చెందుతుందని టీడీపీ అరకు నియోజకవర్గ ఇన్‌చార్జి, విజయనగరం జోన్ ఆర్టీసీ చైర్మన్ సియ్యారి దొన్నుదొర అన్నారు. మండలంలోని మారుమూల పెదకోట నుంచి జాలడ వరకు 11 కిలో మీటర్ల గాను రూ.9.55 కోట్లతో చేపట్టనున్న తారురోడ్డు పనులకు దొన్నుదొర, స్థానిక టీడీపీ నాయకులతో కలిసి గురువారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గతంలో వేసిన తారురోడ్డు వర్షాలకు పూర్తిగా కొట్టుకుపోయి అస్తవ్యస్తంగా మారడంతో జీనబాడు, పినకోట, పెదకోట, కివర్ల పంచాయతీల పరిధిలోని గిరిజనులు పలు ప్రమాదాలకు గురయ్యారన్నారు. ఈ స్థితిలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత గిరిజన సంక్షేమశాఖ నుంచి ఈ రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేసినట్టు చెప్పారు. దీని ద్వారా తమది గిరిజనుల ప్రభుత్వమని మరోసారి రుజువైందన్నారు. అడవి తల్లిబాట పథకం ద్వారా మారుమూల గ్రామాలకు రోడ్లు వేసిన ఘనత ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌కు దక్కుతుందన్నారు. ఈ సందర్భంగా ఆయన గిరిజనుల తరఫున వారికి కృతజ్ఞతలు తెలిపారు. విద్య, వైద్యం, తాగునీరు, రోడ్లు మౌలికవసతులు కల్పనే ధ్యేయంగా ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు. ఈ కార్యక్రమంలో బొర్రా సర్పంచ్ అ ప్పారావు, టీడీపీ నాయకులు ఎమ్.భీమరాజు, పి.రవీంద్ర, వి.ఈశ్వరరావు, జె.దేముడు, డి. నూకరాజు, ఎస్.ఈశ్వరరావు, పి.బాబీ, జె.అప్పలకొండ, జి.సురేశ్, ప్రసాద్, రాజాబాబు, తదితరులు పాల్గొన్నారు.


రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న దొన్నుదొర

శరవేగంగా అభివృద్ధి పనులు

- అధికారులకు ఐటీడీఏ పీవో శ్రీపూజ ఆదేశం

పాడేరు, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): మండలంలోని లగిశపల్లి పంచాయతీ పరిధిలో పలు అభివృద్ధి పనులను ఐటీడీఏ పీవో శ్రీపూజ గురువారం పరిశీలించారు. లగిశపల్లి పంచాయతీ పరిధి రణంబడి ఆదిమ జాతి గిరిజన గ్రామంలో రూ.60 లక్షల వ్యయంతో నిర్మిస్తున్న బహుళ ప్రయోజన భవనాన్ని, రామచంద్రపురం సమీపంలో నిర్మించిన గోకులం షెడ్డును ఆమె పరిశీలించారు. తుది దశ పనులను పూర్తి చేసి ఆయా నిర్మాణా లను ప్రారంభోత్సవాలకు సిద్ధం చేయాలని ఐటీడీఏ పీవో ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంక్షేమ ఇంజనీరింగ్ శాఖ డీఈఈ సింహాచలం, ఏఈఈ దుర్గాప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.


రణబండ గ్రామంలోని మల్టీపర్పస్ భవనాన్ని పరిశీలిస్తున్న ఐటీడీఏ పీవో శ్రీపూజ

డీఆర్‌డీఏ పీడీ మురళికి సత్కారం


డీఆర్‌డీఏ పీడీని సత్కరిస్తున్న కలెక్టర్, మహిళా కమిషన్ చైర్‌పర్సన్ శైలజ

పాడేరు, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ వి.మురళిని ఏపీ మహిళా కమిషన్ చైర్‌పర్సన్ డాక్టర్ రాయపాటి శైలజ, కలెక్టర్ ఏఎస్ దినేశ్‌కుమార్ సత్కరించారు. జిల్లాలో గిరిజన మహిళలను వ్యాపారవేత్తలు తీర్చిదిద్దడంతోపాటు వారి ఆర్థికాభివృద్ధికి ఆయన చేస్తున్న సేవలను గుర్తించి, ఇక్కడ గురువారం జరిగిన రాష్ట్రీయ పోషణ్ మహోత్సవంలో ఆయనకు జ్ఞాపికను అందించి సత్కరించారు. ఆయన సేవలను కొనియాడారు.

మావోయిస్టుల వారోత్సవాల నేపథ్యంలో అప్రమత్తం: ఎస్పీ

పెదబయలు, సెప్టెంబర్ 25 (ఆంధ్రజ్యోతి): స్థానిక పోలీసు స్టేషన్‌ను ఎస్పీ అమిత్ బర్ధర్ గురువారం ఆకస్మికంగా సందర్శించారు. వివిధ కేసుల పరిష్కారంలో సిబ్బందికి సూచనలందించారు. రికార్డులను పరిశీలించారు. పోలిసు స్టేషన్ వివిధ కేసుల్లో పురోగతిని నేరుగా అడిగి తెలుసుకున్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మావోయిస్టు వారోత్సవాల నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలన్నారు. గంజాయి సాగుపై దృష్టి సారించాలని ఆదేశించారు. ఏదైనా అనుకోని సంఘటనలు వస్తే, వాటిని నివారించడానికి ఏరియా డామినేషన్, సమాచారం సేకరణ పెంపొందించిన వ్యూహాత్మక చెక్‌పోస్టులు ఏర్పాటు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.


పెదబయలు స్టేషన్‌లో రికార్డులను పరిశీలిస్తున్న ఎస్పి అమిత్ బర్ధర్

రానున్న ఎన్నికల్లోగా వైసీపీ ఖాళీ

- టీడీపీ అరకు నియోజకవర్గ ఇన్‌చార్జి సియ్యారి దొన్నుదొర


వైసీపీ కార్యకర్తలను టీడీపీలోకిఆహ్వానిస్తున్న దొన్నుదొర, టీడీపీ నాయకులు

అనంతగిరి, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): రానున్న ఎన్నికల్లోగా అరకు నియోజకవర్గంలోవైసీపీ ఖాళీ కావడం ఖాయమని టీడీపీ అరకు నియోజకవర్గ ఇన్‌చార్జి సియ్యారి దొన్నుదొర అన్నారు. మండలంలోని పెదకోట, కివర్ల పంచాయతీల పరిధిలోని బుడ్డిగరువు, చీడిగరువు, జాలడ, కివర్ల, చటకంభ, రేగులపాలెం గ్రామాలకు చెందిన వైసీపీ ముఖ్య కార్యకర్తలు గురువారం టీడీపీలో చేరారు. వారికి దొన్నుదొర కండువాలు వేసి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా దొన్నుదొర మాట్లాడుతూ.. గత వైసీపీ ప్రభుత్వం పాలనతో విసుగెత్తిన ప్రజలు గత ఎన్నికల్లో ఆ పార్టీకి తగిన గుణపాఠం చెప్పారన్నారు. కూటమి ప్రభుత్వం అత్యధిక మెజార్టీతో గెలిపించారని వివరించారు. గిరిజన గ్రామాలను అభివృద్ధిలో గత ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్య ధోరణి అవలంబించగా.. కూటమి ప్రభుత్వం ప్రగతికి కృషి చేస్తోందన్నారు. సీఎం చంద్రబాబు సూపర్‌సిక్స్‌లో భాగంగా ఇచ్చిన హామీలను అమలు చేశారన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు జి.దేముడు, డి.నూకరాజు, జె. అప్పలకొండ, గణేశ్, కృష్ణమూర్తి, రాజుబాబు, ఎం.భీమరాజు, పి.బాబీ, తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీల సుస్థిర అభివృద్ధిపై శిక్షణ

అరకులోయ, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీల సుస్థిర అభివృద్ధికి కృషి చేయాలని స్థానిక ఎంపీడీవో ఎ.లవరాజు పేర్కొన్నారు. బుధవారం అనంతగిరి, అరకులోయ, డుంబ్రిగుడ మండలాలకు చెందిన గ్రామ పంచాయతీ సర్పంచ్‌లు, కార్యదర్శులకు సుస్థిర అభివృద్ధి లక్ష్యాలు, స్థానికీకరణకు సంబంధించి 9 అంశాలపై శిక్షణను స్థానిక మండల పరిషత్‌లో శిక్షణ నిర్వహించారు. ఎంపీడీవో లవరాజు మాట్లాడారు. పలువురు అధికారులు పాల్గొన్నారు.

సాకారం కానున్న ఆదివాసీల కల

... 3వ పేజీ తరువాయి

ప్రత్యేకంగా ఎటువంటి సంక్షేమ ఫలాలు అందడంలేదు. తమ గ్రామాలను ఐదో షెడ్యూల్డు ప్రాంతంలో విలీనం చేయాలని ఎన్నో ఏళ్లుగా ఆందోళనలు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి ప్రస్తుతం జరుగుతున్న శాసనసభ సమావేశాల్లో.. అనకాపల్లి జిల్లాతోపాటు రాష్ట్రంలోని పలు జిల్లాల్లో 600 గిరిజన గ్రామాలు నాన్‌షెడ్యూల్డు ఏరియాలో ఉన్నాయని, దీంతో ఈ గ్రామాలు అభివృద్ధికి నోచుకోవడం లేదని చెప్పారు. ఈ గ్రామాలను ఐదో షెడ్యూల్డు ఏరియాలో చేరుస్తారా? అన్న ప్రశ్నకు మంత్రి సంధ్యారాణి స్పందించారు. రాష్ట్రంలో 496 గిరిజన గ్రామాలను షెడ్యూల్డ్ ప్రాంతంలోకి తెచ్చేందుకు ప్రతిపాదనలు వచ్చాయని, 50 శాతం కంటే ఎక్కువ గిరిజన జనాభా వున్న గ్రామాల వివరాలు తీసుకోవాలని ఐటీడీఏ పీవోలు, కలెక్టర్లకు సూచించామని చెప్పారు. దీంతో మైదానప్రాంత గిరిజనుల్లో ఆశలు చిగురిస్తున్నాయి.

అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్రానికి పంపాలి



అల్లూరి సీతారామరాజు జిల్లాను ఆనుకొని అనకాపల్లి జిల్లాలోని ఎనిమిది మండలాల్లో వున్న గిరిజన గ్రామాల్లో సర్వే నిర్వహించాలి. గ్రామ సభలు నిర్వహించి గిరిజన జనాభా ఎంత శాతం వున్నారో గుర్తించాలి. వాస్తవానికి 200 పైచిలుకు గ్రామాల్లో గిరిజనులు సగానికిపైబడి వున్నారు. కానీ గత వైసీపీ ప్రభుత్వం ఈ సంఖ్యను 114కు తగ్గించింది. పైగా ఈ గ్రామాలను సైతం ఐదో షెడ్యూల్‌లో చేర్చలేదు. ఇందుకు రియల్ ఎస్టేట్, మైనింగ్ వ్యాపారుల ఒత్తిళ్లే కారణం. గిరిజన గ్రామాల్లో వేలాది ఎకరాలను వీరు అక్రమంగా కొనుగోలు చేశారు. ఈ గ్రామాలు ఏజెన్సీలో విలీనం అయితే తాము భూములను కోల్పోవాల్సి వస్తుందన్న ఉద్దేశంతో అడ్డుకుంటున్నారు. గిరిజన గ్రామాలను ఏజెన్సీలో విలీనం చేయడానికి కూటమి ప్రభుత్వం వెంటనే అసెంబ్లీలో తీర్మానం చేసి, పార్లమెంటు ఆమోదం కోసం కేంద్రానికి పంపాలి.

- డి.వెంకన్న, సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు

ఆక్రమణలో పంచాయతీ స్థలాలు

... 3వ పేజీ తరువాయి

నిర్మించుకున్నారు. స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్‌ను ఆనుకుని గతంలో వేసిన లేఅవుట్‌లో పంచాయతీకి దఖలుపడిన సుమారు 200 గజాల స్థలాన్ని ఒక వ్యక్తి ఆక్రమించడంతోపాటు రేకులతో పక్కా నిర్మాణం చేపట్టి నివాసం వుంటున్నారు. రాజుగారిబీడులోని సందప్ప చెరువు వుంతరోడ్డును ఆనుకుని గతంలో వేసిన లేఅవుట్‌లో పంచాయతీకి దఖలుపడిన స్థలంలో ఒక కుటుంబం పాక నిర్మించుకుని వుంటున్నది. దీనిపై 'ఆంధ్రజ్యోతి'లో వార్త ప్రచురితం కావడంతో పంచాయతీ అధికారులు బోర్డు ఏర్పాటు చేశారు తప్ప పాక తొలగించలేదు. సాయిఆదర్శనగర్‌లో వేసిన లేఅవుట్‌లో నేరెళ్ల కాలువను ఆనుకుని పంచాయతీకి కేటాయించిన స్థలాన్ని ఆక్రమించి, పక్కా నిర్మాణం జరిగిన వైనంపై 'ఆంధ్రజ్యోతి'లో కథనం రావడంతో అప్పటి పంచాయతీ ఈఓ స్పందించి, స్థలాన్ని స్వాధీనం చేసుకుంటామని ప్రకటించారు. కానీ ఆ స్థలంలో పక్కా ఇంటి నిర్మాణం జరగ్గా, దీనికి పంచాయతీ అధికారులు ఇంటి పన్ను కూడా వేశారు.

పంచాయతీరాజ్ శాఖ అతిథిగృహం ఎదుట సర్వే నంబర్ 132/3బిలో 1985లో వేసిన లేఅవుట్‌లో ప్రజోపయోగం కోసం కేటాయించిన 408 గజాల స్థలంలో సగం కబ్జాకు గురైంది. మిగిలిన స్థలంలో ఓ వ్యక్తి సిమెంట్ తూరలు తయారు చేసుకుంటూ పంచాయతీకి నామమాత్రంగా అద్దె చెలిస్తున్నారు. చిత్రమందిర్ థియేటర్ ఎదుటి వీధిలో పంచాయతీకి చెందిన సుమారు పది సెంట్ల స్థలంలో పాత ఇనుము కొట్టు వ్యాపారం సాగిస్తున్న వ్యక్తి పంచాయతీకి ఒక్క రూపాయి కూడా చెల్లించడంలేదు. దీనిపై పంచాయతీ ఇన్‌చార్జి కార్యదర్శి కె.డేవిడ్‌ని వివరణ కోరగా.. లేఅవుట్లలో వున్న పంచాయతీ స్థలాలను గుర్తించి బోర్డులు ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. పంచాయతీ స్థలాల్లో నిర్మాణాల విషయాన్ని వీఎంఆర్డీఏ అధికారుల దృష్టికి తీసుకెళతామని, తదుపరి చర్యలు వారే తీసుకుంటారని ఆయన తెలిపారు.

తాచేరు గెడ్డలో పడి రైతు మృతి

... 3వ పేజీ తరువాయి

సుబ్బారావు మృతదేహం కనిపించింది. నీటిలో నుంచి ఒడ్డుకు చేర్చి పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఎస్‌ఐ శ్రీనివాసరావు వచ్చి పరిశీలించారు. మృతదేహానికి పోస్టుమార్టం చేయించి కుటుంబ సభ్యులకు అప్పగించారు. కేసు నమోదు చేసినట్టు ఎస్‌ఐ తెలిపారు. కాగా ఇదే కాజ్‌వే వద్ద మంగళవారం ఉదయం ఎనిమిదో తరగతి విద్యార్థి నీటిలో పడి గల్లంతై మృతిచెందాడు.

ఏయూలో ఉద్రిక్తత

... 3వ పేజీ తరువాయి

చెప్పామని, ఆయన పట్టించుకోకపోవడం వల్లే ఇప్పుడు మణికంఠ మరణించాడని ఆరోపించారు. తక్షణమే ఆయన పదవికి రాజీనామా చేయాలని, మణికంఠ కుటుంబానికి కోటి రూపాయల పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. దీంతో వీసీ రాజశేఖర్ అక్కడికి వచ్చి, తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చి వెళ్లిపోయారు. అయితే విద్యార్థి నాయకులు సంతృప్తి చెందలేదు. డిస్పెన్సరీలో వైద్యం అందకపోవడానికి బాధ్యులైన వారిని సస్పెండ్ చేయాలంటూ సుమారు 50 మంది విద్యార్థులు వీసీ ఛాంబర్‌లోకి దూసుకువెళ్లారు. వారిని ప్రొఫెసర్లు, పోలీసులు అడ్డుకొని వీసీకి రక్షణ కల్పించారు. కాగా మణికంఠ మృతదేహానికి పోస్ట్‌మార్టం చేయకుండా తమకు ఇవ్వాలని తండ్రి శ్రీనివాసరావు కేజీహెచ్ వైద్యులను కోరారు. వీసీ వచ్చి చెబితే తప్ప తాము ఏమీ చేయలేమని వైద్యులు చెప్పడంతో వారు యూనివర్సిటీకి వచ్చి వీసీని కలిశారు. పోలీసుల సాయంతో వీసీ కేజీహెచ్‌కు వెళ్లి చర్చలు జరిపారు. మణికంఠ మృతిపై ఎటువంటి అనుమానాలు లేవని, దానికి ఎవరూ బాధ్యులు కారని రాతపూర్వకంగా ఇస్తే పోస్టుమార్టం లేకుండా మృతదేహాన్ని ఇస్తామని వైద్యులు చెప్పడంతో తండ్రి శ్రీనివాసరావు అక్కడికక్కడే ఆ విధంగా లేఖ రాసి కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ వాణికి ఇచ్చారు. మృతదేహాన్ని ఇవ్వడానికి వైద్యులు రాత్రి ఏడు గంటలకు అంగీకరించారు.

కొవ్వొత్తులతో నివాళి

వీసీ రాజశేఖర్ పోలీసుల సాయంతో కేజీహెచ్‌కు వెళ్లిన తరువాత కూడా విద్యార్థులు ఏయూలో ఆందోళన కొనసాగించారు. రాత్రి ఏడు గంటలకు కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఏయూ ప్రొఫెసర్లు వారితో చర్చించారు. డిస్పెన్సరీలో తక్షణమే వసతులు కల్పిస్తామని, బాధ్యులపై చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అయితే వీసీ రాజీనామా చేయాల్సిందేనని విద్యార్థులు పట్టుబట్టారు. దీనిపై ఆరోగ్య శాఖ మంత్రికి, డిప్యూటీ సీఎంకు, గవర్నర్‌కు ఫిర్యాదు చేస్తామన్నారు. రాత్రి 7.30 గంటకు ఆందోళన విరమించి, శుక్రవారం యూనివర్సిటీ బంద్‌కు పిలుపునిచ్చారు.

కాఫీ కార్మికుల సమస్యలను పరిష్కరించాలి

- సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు చిన్నయ్య పడాల్

చింతపల్లి, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): కాఫీ కార్మికుల సమస్యలు ఏపీఎఫ్‌డీసీ యాజమాన్యం వెంటనే పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు బోనంగి చిన్నయ్యపడాల్ డిమాండ్ చేశారు. గురువారం ఏపీఎఫ్‌డీసీ కాఫీ తోటల్లో పని చేస్తున్న వివిధ డివిజన్ల కార్మికులతో సమావేశమయ్యారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ఏడాది ఏపీఎఫ్‌డీసీ యాజమాన్యానికి, కాఫీ కార్మిక సంఘం నాయకులకు మధ్య జరిగిన చర్చల్లో పలు సమస్యలపై ఒప్పందాలు జరిగాయన్నారు. అయితే, కాఫీ పండ్ల సేకరణ కూలి రేట్లు పెంచకపోగా, కొన్ని ఒప్పందాలను పరిష్కరించలేదన్నారు. క్షేత్ర స్థాయిలో ఖాళీగానున్న ప్లాంటేషన్ కండక్టర్లను మూడు నెలల్లో భర్తీ చేస్తామని ఇచ్చిన హామీ ఆచరణకు నోచుకోలేదన్నారు. ఈఏడాది కచ్చితంగా కాఫీ పండ్ల సేకరణ కూలి రేటు పెంచాలన్నారు. 26 రోజుల పని దినాలు కల్పించాలని, వారాంతపు కూలి చెల్లింపులు చేయాలన్నారు. హెల్పర్లకు కనీస వేతనాలు అమలుతోపాటు గుర్తింపు కార్డులు, ఈపీఎఫ్ సదుపాయం కల్పించాలన్నారు. పీఎఫ్, కార్మికులకు గ్రూప్ ఇన్సూరెన్సుతోపాటు ప్రమాదాలు జరిగిగే వైద్య ఖర్చులు చెల్లించాలన్నారు. లేదంటే సమ్మె చేపడతామన్నారు. ఈ కార్యక్రమంలో కాఫీ కార్మిక సంఘం నాయకులు వెంకటేశ్, గిరి, నాగేశ్వరరావు, నగేశ్, బాబూరావు, కన్నాద్ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న చిన్నయ్య పడాల్,కార్మికులు

ఆకట్టుకున్న డ్యాన్స్ పోటీలు


అమ్మవార్లు, పోతురాజుల డ్యాన్స్ వేస్తున్న కళాకారులు

సీలేరు, సెప్టెంబరు 25 , (ఆంధ్రజ్యోతి) : జీకేవీధి మండలం సీలేరులో దేవీ శరన్నవరాత్రుల 36వ వార్షిక మహోత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. గురువారం రాత్రి స్థానిక జనసేన పార్టీ నాయకుల ఆధ్వర్యంలో డ్యాన్స్ పోటీలను నిర్వహించారు. జూనియర్, సీనియర్ విభాగాల్లో నిర్వహించిన ఈ పోటీల్లో సీలేరు పరిసర గ్రామాలకు చెందిన పలు గ్రామాలతో పాటు ఒడిశాలోని చిత్రకొండ నుంచి వచ్చిన వారు డ్యాన్స్ పోటీల్లో పాల్గొన్నారు. కాత్రగెడ్డ గ్రామానికి చెందిన చిన్నారులు ప్రదర్శించిన అమ్మవార్ల వేషధారణ, పోతురాజు నృత్య ప్రదర్శన ఆకట్టుకున్నాయి. విజేతలకు ఉత్సవాల చివరి రోజున బహుమతు అందిస్తామని ఉత్సవాల నిర్వాహకులు తెలిపారు.

విధుల పట్ల నిర్లక్ష్యం వద్దు: డీఎంహెచ్‌వో

పెదబయలు, సెప్టెంబరు 25 (ఆం ధ్రజ్యోతి) : విధుల పట్ల నిర్లక్ష్యం ప్రదర్శించవద్దని వైద్య సిబ్బందిని డీఎంహెచ్‌వో డాక్టర్ విశ్వేశ్వరనాయుడు హెచ్చరించారు. స్థానిక పీహెచ్‌సీని గురువారం ఆయన తనిఖీ చేశారు. తొలుత ఆస్పత్రిలో రికార్డులను పరిశీలించారు. అనంతరం రోగులకు అందజేస్తున్న వైద్య సేవల గురించి వైద్యాధికారి పి. సత్యశ్రీని అడిగి తెలుసుకున్నారు. నిరంతరం పర్యవేక్షణ ఉండేలా చర్యలు చేపట్టాలన్నారు. ఆయన వెంట జిల్లా ఆరోగ్య విస్తరణాధికారులు జి.సింహాద్రి, ఎం.సంజీవపాత్రుడు, సిబ్బంది ఉన్నారు.



పెదబయలులో రోగితో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో విశ్వేశ్వరనాయుడు

స్వస్థ్ నారీ సశక్త్ పరివార్‌తో మహిళలకు ఆరోగ్యం

ముంచంగిపుట్టు: మహిళలకు సంపూర్ణమైన ఆరోగ్యం కోసం స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమం నిర్వహించనున్నట్టు డీఎంహెచ్‌వో విశ్వేశ్వరనాయుడు అ న్నారు.. కిలగాడ పీహెచ్‌సీ పరిధిలోని నిర్వహిస్తున్న కార్యక్రమాన్ని ఆయన గురువారం సందర్శించారు. 18ఏళ్లు నిండిన మహిళలు గుండెజబ్బులు, నోటి క్యాన్సర్, గర్భాశయం క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించనున్నామన్నారు. వైద్యశిబిరంలో 125 మంది వరకు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలోని వైద్యాధికారిణి శిరీషా, ఎంపీపీ సీతమ్మ, సర్పంచ్ శివశంకరరావు, సింహాద్రి, సంజీవ్‌పాత్రుడు, తదితరులు పాల్గొన్నారు.

జీకే వీధిలో జర్మనీ దేశస్థులు సందడి


నెతన్య వసతి గృహానికి వచ్చిన జర్మనీ దేశస్థులు

గూడెంకొత్తవీధి, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో జర్మనీ దేశస్థులు సందడి చేశారు. గురువారం స్థానిక నెతన్య అనాథ విద్యార్థుల వసతి గృహానికి వచ్చారు. జర్మనీదేశస్థులకు ఆదివాసీలు సంప్రదాయ కొమ్ము నృత్యం, థింసాతో స్వాగతం పలికారు. వసతి గృహంలోనున్న విద్యార్థులతో కలిసి జర్మనీయులు సహపంక్తి భోజనాలు చేశారు. అలాగే, నెతన్య వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ కేఆర్ సింగ్ జన్మదినం పురస్కరించుకుని విదేశీయులతో కలిసి ఆయన కేట్ కట్ చేశారు. ఈ కార్యక్రమంలో నెతన్య సభ్యులు యాకోబు, సువార్తమ్మ, రాబర్ట్, వసుపరి తిమోతి, పద్మాకరరావు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

చింతపల్లి, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): చింతపల్లి సబ్ డివిజన్ పరిధిలోనిశుక్రవారం ఉదయం ఎనిమిది గంటల నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరా అంతరాయం కలుగుతుందని పాడేరు ఏపీఈపీడీసీఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పి. వేణుగోపాల్ తెలిపారు. కొరుప్రోలు-నర్సీపట్నం 132కేవీ లైన్ పనులు చేపడుతున్నందున చింతపల్లి, జీకేవీధి మండలాల పరిధిలోని అన్ని గ్రామాల వినియోగదారులు సహకరించాలని కోరారు.

పాముకాటుతో బాలుడు మృతి


మృతి చెందిన రంజిత్

ముంచంగిపుట్టు, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కుమడ పంచాయతీ చీపురుగొంది గ్రామానికి చెందిన కొర్రా జగబందు, చంద్రకళ దంపతుల కుమారుడు కొర్రా రంజిత్ పాముకాటుకు గురై మృతిచెందాడు.. తల్లిదండ్రులతో కలిసి రంజిత్ ఇంటిలో నిద్రిస్తుండగా గురువారం ఉదయం తెల్లవారుజామున 3గంటల సమయంలోని పాముకాటుకు గురయ్యాడు.. కుమారుడు కొద్దిసేపటికే అపస్మారకస్థితికి చేరుకోవడంపై తల్లిదండ్రులు వెంటనే ఆస్పత్రికి తరలించేలోగా బాలుడు మృతిచెందాడు.. దీంతో తల్లిదండ్రులు కన్నీరు మున్నీరుగా విలపించారు. బాలుడు అదే గ్రామంలోని జీపీఎస్ పాఠశాలలోని 2వ తరగతి చదువుతున్నాడు.

చినలబుడు గ్రామంలో కార్డెన్ సెర్చ్

అరకులోయ, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): చినలబుడు గ్రామంలో గురువారం అరకు సీఐ హిమగిరి, ఎస్‌ఐ జి.గోపాలరావు ఆధ్వర్యంలో కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. ఎస్పీ ఆదేశాలపై డాగ్ స్క్వాడు, డ్రోన్ కెమెరాలతో విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. డాగ్‌స్క్వాడ్‌తో సిబ్బంది గంజాయి, సారా మత్తు పదార్థాలను ఉన్నాయేమో తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా సీఐ ఎస్‌ఐ గ్రామస్థులతో మాట్లాడుతూ గ్రామంలోగంజాయి, నాటుసారా విక్రయిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ తనిఖీల్లో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

జి.మాడుగుల, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి) : పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని డీఎల్‌డీవో జయాప్రకాశ్ సూచించారు. ఎంపీడీవో ఎస్.డేవిడ్‌రాజుతో కలిసి గురువారం సింగర్భ పంచాయతీ కంబలబయలు గ్రామంలో సందర్శించారు. స్వచ్ఛతాహీ సేవ కార్యక్రమంలో భాగంగా గిరిజనులకు అవగాహన కల్పించారు. సింగర్భ లో ఉన్న ఎస్‌డబ్ల్యూపీసీ కేంద్రాన్ని పరిశీలించారు. స్వచ్ఛతహీ కార్యక్రమం అక్టోబరు 2వరకు కొనసాగుతుందని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సచివాయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

దేవరాపల్లిలో తాగునీటి పథకం ప్రారంభం

చింతపల్లి, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దేవరాపల్లిలో తాగునీటి పథకాన్ని పీఏసీఎస్ చైర్‌పర్సన్ మొట్టడం నూకరాజు, స్థానిక సర్పంచ్ సిరిబాల బుజ్జిబాబు గురువారం ప్రారంభించారు. దీంతో ఆదివాసీ మహిళలు సంతోషం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో భారత ఆదివాసీ పార్టీ నేత మొట్టడం రాజబాబు, గ్రామపెద్ద సంజీవరావు పాల్గొన్నారు.

వరిలో సుడిదోమ నివారణకు చర్యలు చేపట్టాలి

- టాటా ట్రస్టు వ్యవసాయ సాంకేతిక నిపుణుడు డాక్టర్ అప్పలరాజు

చింతపల్లి, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): గిరిజన ప్రాంతంలో ఆదివాసీ రైతులు సాగు చేస్తున్న వరిలో సుడిదోమ సమస్య అధికంగా వున్నదని, రైతులు సకాలంలో నివారణ చర్యలు ప్రారంభించాలని వీసీఎఫ్ టాటా ట్రస్టు వ్యవసాయ సాంకేతిక నిపుణుడు డాక్టర్ అప్పలరాజు సూచించారు. గురువారం మండలంలోని కొత్తపాలెం గ్రామ పంచాయతీలో గిరిజన రైతులు సాగు చేస్తున్న వరి పొలాలను వీసీఎఫ్ టాటా ట్రస్టు ప్రతినిధులు క్షేత్ర పరిశీలన చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ అప్పలరాజు మాట్లాడుతూ సుడిదోమ వరి పొలంలో దుబ్బుల మొదల్లో గుంపులుగా చేరి వరి మొక్క నుంచి రసం పీల్చి పంటకు నష్టం చేస్తుందన్నారు. ఈ సుడిదోమ కారణంగా మొక్క బలహీనపడి పోషకాలను


కొత్తపాలెంలో సుడిదోమ ఆశించిన వరి పంటను పరిశీలిస్తున్న అప్పలరాజు, రైతులు

కోల్పోతుందన్నారు. సుడిదోమ కొన్ని రకాల వైరస్‌లను వ్యాప్తి చేస్తుందని చెప్పారు. ఈ సుడిదోమలు ఆశించిన వరి పొలాలు పసుపు రంగులోకి మారిపోవడంతో పాటు వరి పంట సుడులుగా ఎండిపోతుందన్నారు. సుడిదోమ యాజమాన్యం కోసం రైతులు వరి పంటను లైన్లు పద్ధతిలో నాటుకోవాలన్నారు. రసాయన ఎరువులను విచక్షణారహితంగా వినియోగించరాదన్నారు. పొలంలో నీరు నిలబడకుండా చూసుకోవాలని సూచించారు. కేవలం పంటలో బురద పదును మాత్రమే ఉండేలా చూడాలన్నారు. వేపాకుల కషాయం, వేప నూనె సమయానుకూలంగా పిచికారీ చేయడం వలన దోమల వ్యాప్తిని అరికట్టవచ్చునన్నారు. ఉధృతి అధికంగా ఉంటే ఫ్లోనికామైడ్ 70 డబ్ల్యూజీ 60 గ్రాములు ఎకరాకు, పైమెట్రోజన్ 50 డబ్ల్యూజీ 120 గ్రాములు ఎకరాకు, డైనోటీఫురాన్ 15 శాతం, పైమేట్రోజన్ 45 శాతండబ్ల్యూజీ 133 గ్రాములు ఎకరాకు వ్యవసాయ అధికారుల సలహా మేరకు పిచికారీ చేసుకోవడం ద్వారా నియంత్రించుకోవచ్చునన్నారు. రైతులు వ్యవసాయ సలహాలు, సందేహాల కోసం 9177284958 ఫోన్ సంప్రతించాలని తెలిపారు

భవానీ మాలధారుల కోసం ఆర్టీసీ ప్రత్యేక బస్సులు

నర్సీపట్నం, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): విజయవాడ వెళ్లే భవానీ మాలధారుల కోసం ఆర్టీసీ ప్రత్యేక బస్సు సర్వీసులను సమకూరుస్తుందని నర్సీపట్నం డిపో మేనేజర్ ఎంఎస్ఎస్ ధీరజ్ తెలిపారు. ఇందుకోసం బస్టాండ్‌లో ప్రత్యేక రిజర్వేషన్ కౌంటర్ ఏర్పాటు చేశామని అన్నారు. కనీసం 50 మంది ఉంటే వుంటేనే ఆయా గ్రామాల నుంచి విజయవాడకు ప్రత్యేక బస్సు ఏర్పాటు చేస్తామని తెలిపారు. నర్సీపట్నం నుంచి నేరుగా విజయవాడ వెళ్లి రావడానికి ఒక్కో మనిషికి పల్లె వెలుగు రూ.800, అల్ట్రా పల్లె వెలుగు రూ.900, ఎక్స్‌ప్రెస్ బస్సు రూ.1000, అల్ట్రా డీలక్స్ బస్సుకి రూ.1250 చొప్పున టికెట్ చార్జీలు ఉంటాయని వెల్లడించారు. నర్సీపట్నం నుంచి ద్వారకాతిరుమల మీదుగా విజయవాడ వెళ్లిరావడానికి పల్లె వెలుగు బస్సు రూ.860, అల్ట్రా పల్లె వెలుగు రూ.970, ఎక్స్‌ప్రెస్ బస్సు రూ.1,070, అల్ట్రా డీలక్స్ బస్సు రూ.1,350 చార్జీలుగా నిర్ణయించినట్టు పేర్కొన్నారు. అలాగే నర్సీపట్నం నుంచి విజయవాడ వెళ్లి, తిరిగి వచ్చేటప్పుడు, ద్వారకాతిరుమల ద్వారపూడి మీదుగా రావడానికి పల్లె వెలుగు రూ.910, అల్ట్రా పల్లె వెలుగు రూ.1,030, ఎక్స్‌ప్రెస్ బస్సు రూ.1,140, అల్ట్రా డీలక్స్ బస్సు రూ.1,420 చొప్పున చార్జీలు నిర్ణయించామని తెలిపారు.

అలాగే నర్సీపట్నం నుంచి గొల్లలమామిడాడ, ద్వారకాతిరుమల, ద్వారపూడి మీదుగా విజయవాడ వెళ్లడానికి పల్లెవెలుగు రూ.970, అల్ట్రా పల్లె వెలుగు రూ.1,090, ఎక్స్‌ప్రెస్ బస్సు రూ.1,210,, అల్ట్రా డీలక్స్ బస్సు రూ.1,510 టికెట్ చార్జీలు వుంటాయన్నారు. అలాగే నర్సీపట్నం నుంచి భద్రాచలం, పర్ణశాల, విజయవాడ, ద్వారపూడి తీర్థయాత్రకు పల్లెవెలుగు రూ.1,190, అల్ట్రా పల్లె వెలుగు రూ.1,340, ఎక్స్‌ప్రెస్ బస్సు రూ.1,490, అల్ట్రా డీలక్స్ బస్సు రూ.1,860 చొప్పున చార్జీలు ఉంటాయని తెలిపారు. ప్రత్యేక సర్వీసులు కావాల్సిన భక్తులు ముందుగా బుక్ చేసుకోవాలని, మరిన్ని వివరాల కోసం 9494811855, 7382916428, 9493211969 నంబర్లకు ఫోన్ చేసి సంప్రదించాలని కోరారు.



నర్సీపట్నంలో ఏర్పాటు చేసిన ఆర్టీసీ రిజర్వేషన్ కౌంటర్

చోరీ కేసులో నిందితుడి అరెస్టు

కశింకోట, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): బంగారం దొంగిలించిన కేసులో నిందితుడ్ని అరెస్టు చేసినట్టు సీఐ అల్లు స్వామినాయుడు తెలిపారు. గురువారం విలేకరులతో ఆయన మాట్లాడుతూ అచ్చెర్ల కూడలి వద్ద సాధారణ తనిఖీలు చేస్తుండగా కోటవురట్ల మండలం రామచంద్రపాలెం గ్రామానికి చెందిన కరక రాజుబాబు పోలీసులను చూసి అనుమానాస్పదంగా పారిపోతుండగా వెంబడించి అదుపులోకి తీసుకున్నామని చెప్పారు. నిందితుడి బ్యాగు తనిఖీ చేయగా ఎనిమిది తులాల బంగారు ఆభరణాలు లభ్యమయ్యాయని చెప్పారు. మూడు తులాల బంగారు నల్లపూసల దండ, మూడు తులాల బంగారు గొలుసులు, రెండు, తులమున్నర రెండు జతల చెవి దిద్దులు, చెవి బుట్టలు, చైను, గోల్డు రింగు, విరిగిపోయిన రెండు జతల చెవిదిద్దులు స్వాధీనం చేసుకున్నామని ఆయన తెలిపారు. నిందితుడు 30 దొంగతనాలు చేసిన కేసులో 15 సార్లు జైలుకు వెళ్లి వచ్చినట్టు విచారణలో తేలిందన్నారు. ఈ ఏడాది జనవరి 1న కశింకోట అమిరపల్లి వీధిలో జరిగిన దొంగతనంలో 15 తులాల బంగారం అపహరించుకుపోయినట్టు నిందితుడు అంగీకరించాడన్నారు. అలాగే తామరం పీఏసీఎస్‌లో దొంగతనానికి యత్నించిన కేసులో నిందితుడుగా ఉన్నాడన్నారు. ఈ మేరకు నిందితున్ని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామని సీఐ తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

చీడికాడ: మండలంలో శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని ఏఈఈ నమ్మి వెంకటరావు తెలిపారు. తురువోలు, కోనాం ఫీడర్ పరిధిలో తురువోలు, అర్జునగిరి, జి.కొత్తపల్లి, పెదగోగాడ, వరహాపురం, వింటిపాలెం, చుక్కపల్లి, చెట్టుపల్లి, కోనాం, శిరిజాం, మంచాల గ్రామాల్లో వినియోగదారులు సహకరించాలని కోరారు.

దేవరాపల్లి మండలంలో..

దేవరాపల్లి: స్థానిక సబ్ స్టేషన్ పరిధిలో శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఈపీడీసీఎల్ ఏఈఈ క్రరి శంకరరావు తెలిపారు. దేవరాపల్లి, రైవాడ, కాశీపురం, పెదనందిపల్లి, నాగయ్యపేట, సీతంపేట, తామరబ్బ, చింతలపూడి, చిననందిపల్లి తదితర గ్రామాల ప్రజలు సహకరించాలని కోరారు.

స్వచ్ఛతా హి సేవా కార్యక్రమం

చోడవరం, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ కార్యాలయాల పరిసరాల్లో స్వచ్ఛతాహీ సేవా కార్యక్రమంలో భాగంగా గురువారం అధికారుల ఆధ్వర్యంలో పారిశుధ్య పనులు నిర్వహించారు. స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ పంచాయతీరోడ్డు, కోటవీధి ప్రాంతాల్లో శుభ్రం చేశారు. పారిశుధ్య కార్మికులకు సత్కారం చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ గాడి కాసు, ఎండీవో అంజనేయులు, ఈవోపీఆర్డీ అర్జునరావు, మండల ఇంజినీరు శాంతారాం, ఎంపీటీసీ సభ్యురాలు కె.రూపాదేవి, ఈవో శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఘనంగా భజన కార్యక్రమం

దేవరాపల్లి, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎ.కొత్తపల్లిలో సత్యసాయి శతజయంతుత్సవాలు, శరన్నవరాత్రుల్లో భాగంగా వంద పాటలతో భజన కార్యక్రమం గురువారం రాత్రి జరిగింది. సత్యసాయి జిల్లా అధ్యక్షుడు కసిరెడ్డి అప్పలనాయుడు, జోన్ ఇన్‌చార్జి రవిశంకరు, పెంటారావు, కన్నబాబు, జగన్నాథం తదితరులు పాల్గొన్నారు.

కోనాం సంతలో నాటుకోళ్లకు గిరాకీ



నాటుకోళ్లు అమ్ముతున్న గిరిజనులు

చీడికాడ, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కోనాం సంతలో నాటుకోళ్లకు గిరాకీ పెరిగింది. చీడికాడ, హుకుంపేట, అనంతగిరి మండలాల్లోని పలు గ్రామాల నుంచి గిరిజనులు సంతకు నాటుకోళ్లను తీసుకువచ్చారు. పండుగ సందర్భంగా నాటు కోళ్లను కొనుగోలు చేసేందుకు మైదాన ప్రాంతం నుంచి జనం తరలివచ్చారు. సాధారణ రోజుల్లో వెయ్యి రూపాయలకు లభించే నాటుకోడి, ఈ వారం రూ.1,500 నుంచి రూ.2 వేల వరకు ధర పలికింది.

శ్రమదానంతో ఎన్టీఆర్ స్టేడియం శుభ్రం



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న కౌన్సిలర్ చింతకాయల పద్మావతి

నర్సీపట్నం, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ మినీ స్టేడియంలో పురపాలక సంఘం చేపట్టిన ఏక్ దిన్ ఏక్ గంట ఏక్ సాత్ కార్యక్రమంలో భాగంగా వాకర్స్ క్లబ్ సభ్యులు మునిసిపల్ సిబ్బందితో కలిసి శ్రమదానం చేసి శుభ్రం చేశారు. 26వ వార్డు కౌన్సిలర్ చింతకాయల పద్మావతి గురువారం ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ప్లాస్టిక్ నిషేధానికి అందరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. స్వచ్ఛతా కార్యక్రమంలో ప్రజలంతా భాగస్వామ్యం కావాలని సూచించారు. అనంతరం వాకర్స్ క్లబ్ సభ్యులు, మునిసిపల్ సిబ్బంది, సచివాలయం ఉద్యోగులు స్టేడియం నలుమూలలా చెత్తా చెదారం తొలగించి పరిశుభ్రం చేశారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ కమిషనర్ సురేంద్ర, వాకర్స్ క్లబ్ కార్యదర్శి కామిరెడ్డి సత్యనారాయణ, ఉపాధ్యక్షుడు కుప్పిలి స్వామి, ట్రెజరర్ అల్లు అప్పారావు, సహాయ కార్యదర్శి శంకర్‌రెడ్డి, ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ బాబీ, పీఆర్‌టీయూ అధ్యక్షుడు వరహాలనాయుడు, ఎంఎస్ ప్రసాద్, ప్రభుత్వ పెన్షనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు గజ్జాలమ్మ, నింజాస్ అకాడమీ విద్యార్థులు పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికుల సేవలు గుర్తించాలి

నాతవరం, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): తక్కువ వేతనంతో ఉదయాన్నే లేచి గ్రామాలను పరిశుభ్రం చేస్తున్న పంచాయతీ కార్మికుల సేవలను అందరూ గుర్తించాలని ఎంపీడీవో ఎం.సత్యశ్రీనివాసు కోరారు. మండల కేంద్రంలో స్వచ్ఛత హి సేవ కార్యక్రమంలో భాగంగా గురువారం పారిశుధ్య కార్మికులను సన్మానించారు. అనంతరం ఎంపీడీవో సత్యశ్రీనివాసు మాట్లాడుతూ గ్రామాలను పరిశుభ్రంగా ఉంచేందుకు అందరి సహకారం ఉండాలని కోరారు. డిప్యూటీ ఎంపీడీవో మూర్తిబాబు, కార్యదర్శి శేషు, జడ్పీటీసీ సభ్యుడు అప్పలనర్స, సర్పంచ్ రాణి, పీఏసీఎస్ చైర్‌పర్సన్ ఎ.మాణిక్యం, నాయకులు పైల పోతురాజు, పి.కొండబాబు, పి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

కొత్త టీచర్లలో సంబరం

మెగా డీఎస్సీలో 1269 మంది ఎంపిక.. విజయవాడలో నియామకపత్రాలు

హాజరుకాలేకపోయిన 25 మంది బాలింతలు, గర్భిణులు



నియామకపత్రాలతో నూతన ఉపాధ్యాయినులు

విశాఖపట్నం, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): మెగా డీఎస్సీ ద్వారా ఎస్టీటీ నుంచి ప్రిన్సిపాల్ వరకు పలు కేడర్లలో ఉమ్మడి విశాఖ జిల్లాకు చెందిన మొత్తం 1,269 మంది ఎంపికయ్యారు. వీరిలో గురువారం సాయంత్రం విజయవాడలో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో 1,244 మంది నియామకపత్రాలు అందుకున్నారు. ముందస్తు అనుమతితో హాజరుకాలేని 25 మందిలో బాలింతలు, గర్భిణులున్నారు. వీరికి త్వరలో విశాఖపట్నంలో నియామకపత్రాలను అందజేస్తారు. ఈ కార్యక్రమానికి హాజరయ్యేందుకు బుధవారం జిల్లా నుంచి సుమారు 70 బస్సుల్లో కొత్త ఉపాధ్యాయులు విజయవాడకు బయలుదేరి వెళ్లారు. వీరిలో ఉమ్మడి జిల్లా అరకు ప్రాంతానికి చెందిన ఒకరిద్దరికి ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు నియామకపత్రాలు అందజేశారు. మిగిలిన వారికి ప్రాంగణంలో ఏర్పాటుచేసిన కౌంటర్లలో అందజేశారు. ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి విజయవాడ వెళ్లే వారికి నాయకత్వం వహించిన పాఠశాల విద్యాశాఖ ఆర్జేడీ విజయభాస్కర్, ఆ శాఖ డీఈవో ఎన్.ప్రేమ్‌కుమార్, ఇతర అధికారులు, సిబ్బందిని పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ విజయరామరాజు అభినందించారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు ఐఎస్‌వో గుర్తింపు



ఐఎస్‌వో సర్టిఫికెట్ అందుకుంటున్న ప్రిన్సిపాల్ రాజు

నర్సీపట్నం, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు ఐఎస్‌వో గుర్తింపు లభించింది. హైదరాబాద్‌కి చెందిన హైమ్ ఇంటర్నేషనల్ సంస్థ ప్రభుత్వ కళాశాలలో మౌలిక సదుపాయాలు, ఆధునిక విద్యా బోధన, వసతులకు ఐఎస్‌వో గుర్తింపు సర్టిఫికేట్ అందజేసింది. గురువారం విశాఖపట్నంలో జరిగిన ఒక కార్యక్రమంలో డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.రాజు ఈ సర్టిఫికెట్ అందుకున్నారు.

కాత్యాయని అలంకరణలో దుర్గమ్మ



నర్సీపట్నం, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా దుర్గమ్మ కాత్యాయని అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. దుర్గామల్లేశ్వర స్వామి ఆలయంలో అమ్మవారిని గురువారం కాత్యాయనీదేవిగా అలంకరించారు. భక్తులు అమ్మవారిని దర్శించుకొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. అనంతరం అన్నప్రసాద వితరణ ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో అలయ చైర్మన్ నాగేంద్రరాజు పాల్గొన్నారు.

రాచపల్లి గ్రామసభ వాయిదా

మాకవరపాలెం, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): మండలంలో రాచపల్లి సచివాలయం వద్ద గురువారం జరగాల్సిన గ్రామ సభ అనివార్య కారాణాల వల్ల వాయిదా పడిందని తహశీల్దార్ జి.వెంటకరమణ తెలిపారు. ప్రస్తుతం రైతుల జాబితాలను సచివాలయంలో వేలాడదీశామన్నారు. అభ్యంతరాలు ఉంటే నేరుగా తమ కార్యాలయంలో అందజేయాలన్నారు. అలాగే గ్రామ సభ ఎప్పుడు నిర్వహించేది త్వరలో ప్రకటన చేస్తామని ఆయ తెలిపారు. కాగా రాచపల్లి, రామన్నపాలెం గ్రామాల రైతులు సర్వే చేసినప్పడు కొలతలు జాబితాల్లో కనిపించలేదని ఫిర్యాదు అందజేశారు.

29న పీఏసీఎస్ సర్వసభ్య సమావేశం

సొసైటీ చైర్మన్ సాంబమూర్తి



గొలుగొండ, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో ఈ నెల 29న చోద్యం పీఏసీఎస్ సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్టు సొసైటీ చైర్మన్ చిటికెల సాంబమూర్తి తెలిపారు. రైతులకు అన్ని విధాలా వ్యవసాయ రుణాలు మంజూరుకు కృషి చేస్తున్నట్టు చెప్పారు. ఈ సమావేశంలో సొసైటీలో రైతులకు అందుతున్న వివిధ పంటల రుణాలపై అవగాహన కల్పిస్తామన్నారు. ఈ సమావేశానికి రైతులు తప్పక హాజరుకావాలని ఆయన కోరారు.

పర్యావరణాన్ని కాపాడుకుందాం..

గొలుగొండ, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అమ్మపేట పాఠశాలలో గురువారం మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా విప్పలపాలెం నీటి సంఘం చైర్మన్ గొల్లి సత్యనారాయణ మాట్లాడుతూ ఇళ్ల వద్ద మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడుకుందామని పిలుపునిచ్చారు. అనంతరం పలువురికి మొక్కలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ నిద్ర దేముడునాయుడు పాల్గొన్నారు.

పంచాయతీల అభివృద్ధికి ప్రణాళిక

నాతవరం, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): పంచాయతీల అభివృద్ధికి కార్యదర్శులు, సర్పంచులు ప్రణాళికలు రూపొందించాలని ఎంపీడీవో సత్యశ్రీనివాసు సూచించారు. మండల పరిషత్ కార్యాలయంలో గురువారం కార్యదర్శులకు, సర్పంచ్‌లకు స్థానిక సంస్థల సుస్థిర అభివృద్ధిపై శిక్షణ తరగతులు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్దేశించిన సుస్థిర అభివృద్ధిని సాధించడానికి కార్యదర్శులు, సర్పంచులు కలసి పని చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో మూర్తిబాబు హౌసింగ్ ఏఈ జోగారావు పాల్గొన్నారు.

కాత్యాయని అవతారంలో దుర్గామాత



చోడవరంలో కాత్యాయని రూపంలో దుర్గామాత



కొత్తపేటలో అమ్మవారు

చోడవరం, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): దసరా నవరాత్రి ఉత్సవాలలో భాగంగా స్థానిక పాతబస్టాండ్ ఆవరణలోని దుర్గగుడిలో అమ్మవారు కాత్యాయని అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులు పూజలు చేశారు.

కొత్తకోటలో కనకదుర్గమ్మ..

రావికమతం: కొత్తకోట శ్రీదుర్గా దేవి ఆలయంలో అమ్మవారు నాలుగవ రోజు గురువారం కాత్యాయనీ దేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. అర్చకులు వేపా రామకృష్ణ కిశోర్ ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు. కొత్తకోటతోపాటు పరిసర గ్రామాలకు చెందిన పలువురు భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. ఆయన భక్తులకు గోత్రనామాలతో ప్రత్యేక పూజాది కార్యక్రమాలు నిర్వహించారు.

చీడికాడ: అప్పలరాజుపురం దేవి మెట్టపైనున్న లలితాదేవి గురువారం శ్రీమాతా కాత్యాయనీదేవిగాభక్తులకు దర్శనమిచ్చారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. అర్చకులు కిరణ్‌శర్మ ఆధ్వర్యంలో లలితాదేవికి కుంకుమ పూజలను ఘనంగా నిర్వహించారు.

అంబరాన్ని తాకిన భవానీ అంబలం పూజ



చినపాచిలలో అంబలంపూజలో టీడీపీ నేత కోమటి శంకరరావు,తదితరులు

రావికమతం, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): మండలంలో చినపాచిల గ్రామంలో బుధవారం రాత్రి శ్రీదుర్గా దేవి అంబలం పూజ ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన భవానీ భక్తులు ఏర్పాటు చేసిన ఈ పూజను వేద పండితులు ఆరవెల్లి వెంకట గోపాలాచార్యులు ప్రారంభించారు. శివపార్వతులు, శ్రీవెంకటేశ్వరస్వామి, శ్రీలక్ష్మి , కనక దుర్గఅమ్మ వారికి పూజలు నిర్వహించారు. పలు మండలాలనుంచి భవానీ మాలధారణ భక్తులు వేల సంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం భజన కార్యక్రమం నిర్వహించారు. భజన కార్యక్రమం అనంతరం భవానీ భక్తులకు అల్పాహారం ఏర్పాటు చేశారు. కొత్తకోటలో ఆ గ్రామంలో కనక దుర్గ ఆలయంలో అర్చకులు గురు భవానీ వేపా రామకృష్ణ శర్మ ఆధ్వర్యంలో జరిపిన పూజల్లో టీడీపీ నియోజక వర్గ మహిళ అధ్యక్షురాలు కోట నీలవేణి, టీడీపీ నాయకులు కోట గోవిందరావు, జనసేన పార్టీ నియోజక వర్గ ఇన్‌చార్జి పీవీఎస్ఎన్ రాజు ఉన్నారు.



ఆరు మండలాల నుంచి భారీగా వేలాది మంది వచ్చిన భవానీ భక్తులు

పశువుల్లో వ్యాధులపై అశ్రద్ధ వహించవద్దు

» జిల్లా పశు సంవర్థక శాఖ అధికారి రామ్మోహనరావు



మాట్లాడుతున్న రామ్మోహనరావు

రావికమతం, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): పశువులకు సోకే వివిధ రకాల వ్యాధులపై నిర్లక్ష్యం వహించవద్దని జిల్లా పశు సంవర్థక శాఖ అధికారి రామ్మోహనరావు అన్నారు. మండలంలోని జెడ్. బెన్నవరం పంచాయతీ శివారు కిత్తంపేటలో గురువారం నిర్వహించిన పశు వైద్య శిబిరంలో ఆయన పాల్గొని మాట్లాడారు. పశువులు ఆహారం తినకున్నా, పాలు ఇవ్వకున్నా, అదే పనిగా అరుస్తున్నా ఏదో వ్యాధి సోకినట్టేన్నారు. అటువంటి పశువును గుర్తించిన వెంటనే సమీపంలో ఉన్న పశు వైద్యాధికారి వద్దకు తరలించి తగిన చికిత్స అందజేయాలని కోరారు. గాలి కుంటు వ్యాధి నివారణకు టీకాలు తప్పని సరిగా వేయించాలని సూచించారు. అనంతరం శిబిరానికి వచ్చిన 67 పశువులకు గర్భకోశ చికిత్సలు, 127 పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలను పశు వైద్యాధికారులు జి. నూకేశ్, జి. బాలతేజ, సురేశ్, దమయంతి, ప్రతాప్ ఆధ్వర్యంలో అందించారు. అనకాపల్లి జిల్లాలో 2,46,100 పశువులకు గాలి కుంటు వ్యాధి నివారణ టీకాలు వేయాల్సి ఉండగా, 79,360 పశువులకు ఇప్పటి వరకు పూర్తి చేసినట్టు జిలా పశు సంవర్థక శాఖ నోడల్ అధికారి గౌతమ్ వర్మ తెలిపారు. ఈ కార్యక్రమంలో పశుగణాభివృద్ధి సంస్థ నోడల్ ఆఫీసర్ సౌజన్య తెలిపారు. రావికమతం పశు సంవర్థక శాఖ ఏడీ టి.పుష్ప, ఎంపీడీవో మహేశ్, టీడీపీ నేత సాలాపు రమేశ్, సర్పంచ్ పి.రామలక్ష్మి, మాజీ సర్పంచ్ క్రరి అర్జున, పెదిరెడ్ల నాగేశ్వరరావు, మండల పరిషత్ ఏవో సీతారామ స్వామి తదితరులు పాల్గొన్నారు.

పెరటికోళ్లకు కొక్కెర తెగులు రాకుండా టీకాలు

మాడుగుల రూరల్: పెరటి కోళ్లకు కొక్కెర తెగులు రాకుండా టీకాలు వేస్తున్నట్టు మాడుగుల ప్రాంతీయ పశు వైద్యశాల సహాయ సంచాలకులు చిట్టినాయుడు తెలిపారు. గురువారం మండలంలోని వీరవిల్లి అగ్రహారం, జేడీపేట పలు గ్రామాల్లో సిబ్బంది కోళ్లకు టీకాలు వేశారు. మండలంలో సుమారు 1360 కోళ్లకు టీకాలు వేశామన్నారు. రైతు సేవా కేంద్రాల పరిధిలో ఉచితంగా టీకాలు వేస్తామని చెప్పారు.

గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు

రోలుగుంట: గ్రామాల్లో పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలకు మరోవిడత వేయనున్నట్టు స్థానిక పశువైద్యాధికారి నూకేశ్వరరావు పేర్కొన్నారు. గురువారం మండల కేంద్రంలో గాలికుంటు వ్యాధి నివారణ టీకాల కార్యక్రమం నిర్వహించారు. 138 పశువులకు టీకాలు వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పశువైద్యశాల ఆధ్వర్యంలో ఏడు బృందాల ద్వారా ఈ టీకాలు వేస్తున్నట్టు చెప్పారు. నిర్ణీత షెడ్యూల్ ప్రకారం మండలంలో 11వేల పశువులకు టీకాల లక్ష్యమని తెలిపారు.

స్వస్థ్ నారీ వైద్య శిబిరాలు



కింతలి వల్లాపురంలో వైద్యశిబిరం నిర్వహిస్తున్న దృశ్యం

రోలుగుంట, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ కార్యక్రమం ద్వారా మహిళల ఆరోగ్య పరిరక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్టు స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారిణి మాజిద బేగం పేర్కొన్నారు. గురువారం కొవ్వూరులో వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలకు క్యాన్సర్ స్క్రీనింగ్ వైద్య పరీక్షలు నిర్వహించారు. పలువురు రోగులకు రక్తపరీక్షలు నిర్వహించి మందులను అందించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కాంతమ్మ, ఐటీడీపీ ఇన్‌చార్జి బంటు రాజు, మాజీ సర్పంచ్ ఈశ్వరరావు పాల్గొన్నారు.

మాడుగుల రూరల్: మండలంలోని కింతలివల్లాపురంలో గురువారం వైద్య శిబిరం నిర్వహించారు. వైద్యాధికారి సోముదొర 120 మందికి తనిఖీలు చేసి మందులు అందించారు. వర్షాలు పడుతున్నందున కాచి చల్లార్చిన నీటిని తాగాలని, సూచించారు. అనంతరం పోషకాహారం కిట్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ తాళ్లపురెడ్డి రాంబాయి, రాంబాబు, స్థానిక నాయకులు అశోక్, వైద్య సిబ్బంది, అంగన్‌వాడీ వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

దేవరాపల్లి: మండలంలోని కాశీపురంలో గురువారం నిర్వహించిన శిబిరంలో 301 మంది వైద్య పరీక్షలు జరిపినట్లు వైద్యాధికారి వనజ తెలిపారు. ఆయుర్వేద వైద్యులు గ్రీష్మ, పర్య వేక్షకుడు పుష్పరాజు ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

ప్రణాళికతో పంచాయతీల అభివృద్ధి

డివిజనల్ పంచాయతీ అభివృద్ధి అధికారి మంజులవాణి



సమావేశంలో మాట్లాడుతున్న అధికారిణి మంజులవాణి

చోడవరం, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): సుస్థిర ప్రణాళికలతో పంచాయతీల అభివృద్ధికి దో హదపడాలని జిల్లా డివిజనల్ అభివృద్ధి అధికారిణి మంజులవాణి సూచించారు. గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సుస్థిర అభివృద్ధి, లక్ష్యాలు స్థానికీకరణ అంశంపై సర్పంచ్‌లు, కార్యదర్శులకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో మాట్లాడారు. ఆమె గ్రామాల అభివృద్ధిపై సూచనలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఎంపీపీ గాడి కాసు, ఎంపీడీవో అంజనేయులు, ఈవోపీఆర్డీ అర్జునరావు, మండల ఇంజనీర్ శాంతారాం, చోడ వరం, చీడికాడ మండలాలకు చెందిన పంచాయతీ సర్పంచ్‌లు కార్యదర్శులు పాల్గొన్నారు.

కె.కోటపాడు: స్థానిక మండల పరిషత్ కార్యాలయం స మావేశ మందిరంలో సుస్థిరమైన అభివృద్ధి లక్ష్యాలపై శిక్షణ నిర్వహించారు. ఇన్‌చార్జి ఎంపీడీవో గురజాపు రమణి ఆధ్వర్యంలో జరిగిన ఈ శిక్షణలో కె.కోటపాడు, దేవరాపల్లి ఎంపీపీలు రెడ్డి జగన్‌మోహన్, చింతల బుల్లి లక్ష్మి ము ఖ్యఅతిథులుగా పాల్గొన్నారు. రెండు మండలాలకు చెందిన సర్పంచ్‌లు, పంచాయతీల కార్యదర్శులు, మండల స్థాయి అధికారులు, సచివాలయాల సిబ్బంది పాల్గొన్నారు. కె. కోటపాడు మండల పంచాయతీ కార్యదర్శులు చినబా బు, కొండలరావు, మహేంద్ర, జీవన్, దేవరాపల్లి కార్యదర్శులు వినోద్, గోపినాథ్ లోకలైజషన్ అఫ్ సస్టెయినబుల్ డెవలప్‌మెంట్ గోల్స్ పై అవగాహన కల్పించారు.

ఫ్లోరెన్స్ నైటింగేల్ ఆదర్శం



ఫ్లోరెన్స్ నైటింగేల్‌కు నివాళులు అర్పిస్తున్న విద్యార్థినులు

చోడవరం, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): నర్సింగ్ వృత్తి చేపట్టే విద్యార్థినులకు ఫ్లోరెన్స్ నైటింగేల్ ఆదర్శం కావాలని స్థానిక ఉషోదయ కళాశాలల చైర్మన్ జె. రమణాజీ తెలిపారు. గురువారం జూనియర్ కాలేజీ ఒకేషనల్ విభాగం ఆధ్వర్యంలో కాలేజీలో లేంప్ లైటింగ్ సెరిమనీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వృత్తివిద్యా చదువుతున్న విద్యార్థినులు ఫ్లోరెన్స్ నైటింగేల్ చిత్రపటానికి నివాళులర్పించి ప్రమాణం చేశారు. ఈ కార్యక్రమంలో కరస్పాండెంట్ కృష్ణకుమారి, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ శ్యాంజీ, డీన్ ఎస్‌వీ. వాసు, ప్రిన్సిపాల్ అప్పారావు, వైస్ ప్రిన్సిపాల్ రమేష్‌బాబు, ఒకేషనల్ కాలేజీ హెడ్ గోవిందమ్మ, లెక్చరర్లు పాల్గొన్నారు.

క్లాప్ మిత్రలకు సన్మానం



క్లాప్ మిత్రను సన్మానం చేస్తున్న దృశ్యం

బుచ్చెయ్యపేట సెప్టెంబరు 25 (ఆంధ్ర జ్యోతి): మండలంలోని పంచాయతీల్లోని క్లాప్ మిత్రలకు సన్మానించారు. ఎంపీడీవో శివప్రసాద్, విశాఖ డెయిరీ డైరెక్టర్ గేదల సత్యానారాయణ, ఎంపీపీ దాకవరపు నాగేశ్వరి దేవి, స్థానిక సర్పంచ్ సుంకర లక్ష్మి, పీఏసీఎస్ చైర్‌పర్సన్ డొంకిన అప్పల నాయుడు, ఎంపీటీ దేవర అప్పారావుల ఆధ్వర్యంలో వారి దుస్తులు అందించి సన్మానించారు. వారి సేవలను కొనియాడారు. కార్యదర్శులు పాల్గొన్నారు.